teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 125 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 30 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సీరియస్

**కవిత బెయిల్ విషయంలో రేవంత్ వ్యాఖ్యలను తప్పుపట్టిన ధర్మాసనం**



న్యూ ఢిల్లీ, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. కవిత బెయిల్ విషయంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలను ధర్మాసనం తీవ్రంగా తప్పు పట్టింది. గురువారం ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంగా ఈ అంశం ప్రస్తవనకు వచ్చింది. రేవంత్ వ్యాఖ్యలను మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

మిగతా 2 లో



## ఐనా ఇంకెక్కడి భాషాభిమానం..

ఎందుకని గగ్గోలుపడుతావ్
కండ్లముందు ఎన్నో
మారిపోతుండగా
ఒక్క భాషాను పట్టుక
వెళ్లాడుతున్నావ్
పొత్తిళ్ళ నుండి వీడిపడ్డకా ఎన్ని
మారలేదు..
ఒంటిమీద బట్టమారలేదా..
కంచంల కూడుమారలేదా...?
ఎన్నెన్నో మారినా ఒక్క భాషనే
ఎందుకని..?
నీకంటే ముందుతరం వేల
ఏండ్లు అక్షరం ముఖం
చూడకున్నా
లక్షణంగా బతికిండ్లూ.. !!
ఎక్కడో ఒక్కడూ ఆక్షరాజ్ఞానం
నేర్చుకున్నా..
కింది కులాలోనికి అందకుండా
చేసి వంచించిండూ..
నాగరి "కథ" పెరుగుతున్న కొద్దీ
భాషల్లో మార్పులు తెచ్చి
బహుజనులకు చదువును
దూరం చేసిండ్లూ..
సంస్కృతం, దైవభాష, పామరుని
భాషని భాషను ఎన్నెన్నో
శాఖోపా శాఖలు చేసి
విడగొట్టిండ్రు మనల్ని
చెదగొట్టిండ్రూ..
ఐనా ఇంకెక్కడి భాషాభిమానం..
జాతులు అంతర్ధనమవుతూ
దేశాలు ఏకీకరణపొందుతుంటే
ప్రపంచమే ఓ కుగ్రామంగా మారి
దూరాన్ని తగ్గిస్తుంటే
జాతులు కనుమరుగైపోతున్న
దుస్థితిలో భాష కోసం
తండ్లాడుతున్న స్థితిలో..
ఉర్వి.

(ఐలయ్య అంకేశ్వరపు జర్నలిస్ట్)



# రాష్ట్రంలో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

## ఈ ఏడాది పెరిగిన వినియోగం 15,573 మెగావాట్లు

**ఆగస్టు నుంచి ఇప్పటికి 266.14 మిలియన్ యూనిట్లు సరఫరా.. విద్యుత్‌శాఖ అధికారులను అభినందించిన డిప్యూటీ సీఎం**

తెలంగాణ రాష్ట్రంలో డిస్కంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకున్నది. గురువారం ఉదయం 7.30 గంటలకు రికార్డు స్థాయికి చేరుకుందని. ఈ ఏడాది ఈ సీజన్‌లో 15,573 మెగావాట్లకు విద్యుత్ వినియోగం పెరిగిందని జెన్, ట్రాన్స్‌కో సీఎండీ తెలిపారు. గతేడాదిలో ఈ సీజన్‌లో అత్యధికంగా 14,816 మెగావాట్లు వినియోగం నమోదైందని గతేడాదితో పోలిస్తే 5.11శాతం అత్యధిక వినియోగమని పేర్కొన్నారు.



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): గతేడాది మార్చిన 15,623 మెగావాట్ల రికార్డు విద్యుత్ వినియోగం రికార్డయ్యిందని అత్యధికంగా మార్చి 14న 308.54 మిలియన్ యూనిట్లు వినియోగించినట్లు తెలిపారు. ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 266.14 మిలియన్ యూనిట్లు సరఫరా

మిగతా 2 లో

## యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి

**కామన్ రిక్రూట్మెంట్ బోర్డు రద్దుకు సర్కారు యోచన**

**ప్రొఫెసర్ల నియామక ప్రక్రియపై త్వరలోనే నిర్ణయం**



హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని సర్కారు యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఏండ్ల నుంచి ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేసేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. అయితే, కామన్ రిక్రూట్మెంట్ ఆలోచనను పక్కన పెట్టి వర్సిటీలవారిగానే నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో విద్యాశాఖ పరిధిలోని11 వర్సిటీల్లో 2,837 శాంక్షన్డ్ టీచింగ్ పోస్టులు ఉన్నాయి. కొత్తగా ప్రారంభించిన మహిళా వర్సిటీకి ఇంకా పోస్టులను మంజూరు చేయలేదు. అయితే, శాంక్షన్డ్ పోస్టుల్లో సుమారు 2 వేల పోస్టులు

మిగతా 2 లో

## డిజాస్టర్ మేనేజ్మెంట్ బలోపేతం చేస్తున్నాం

ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తీవ్రతను తగ్గించేందుకు చర్యలు
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ వెల్లడి



.. వివరాలు 2లో



## హైడ్రా పేరుతో బెదిరిస్తే చర్యలు తీసుకుంటాం : సీఎం

**హైడ్రాపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నత స్థాయి సమీక్షా**

**పూర్తి బాధ్యతలను హైడ్రాకు అప్పజెప్పేందుకు చర్యలు**

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ నిమిత్తం గత కొన్ని రోజులుగా తెలంగాణ సర్కారు హైడ్రా ద్వారా గట్టి చర్యలు తీసుకుంటోంది. ఇది రాజకీయ రంగు కూడా పులుముకుంది. ఆక్రమణల తొలగింపు పేరుతో మధ్యతరగతి, పేద వర్గాలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే మరో వైపు ఆక్రమణ తొలగింపునకు ప్రశంసలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రాపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురువారం నాడు ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ లో హైడ్రా పేరు చెప్పి భయపెట్టి బెదిరించి కొందరు కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై

మిగతా 2 లో



## గణేష్ ఉత్సవాల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ కు ఆదేశాలు**

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): గణేష్ ఉత్సవాల నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ప్రభుత్వానికి, నిర్వాహకులకు మధ్య సమన్వయం

మిగతా 2 లో

## హౌ టు రెస్పెక్ట్ విమెన్‌ను పాఠ్యాంశంగా చేరుస్తాం

**శిక్షా, శిక్షణ ఏకకాలంలో జరిగినప్పుడే నేరాలు తగ్గుతాయి**

**రాష్ట్ర మంత్రి సీతక్క వాఖ్యలు**



రాష్ట్రంలో 'హౌ టు రెస్పెక్ట్ విమెన్' టాపికును పాఠ్యాంశంగా చేరుస్తామని, శిక్షా, శిక్షణ ఏక కాలంలో జరిగినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నేరం జరిగిన వెంటనే బాధితులకు సత్వర న్యాయం చేయడంతో పాటు, నిందితులకు త్వరగా శిక్ష పడేలా వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించారు.

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): మానవ అక్రమ రవాణా నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్ హెచ్ఐసీసీలో తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి సీతక్క ప్రసంగించారు. తెలంగాణలో అమ్మాయిలు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. తెలంగాణలో అమలవుతోన్న

మిగతా 2 లో

## ప్రజల రక్షణ కోసం పోలీసులు వినూత్న ప్రయోగం

**పోలీస్ తరహాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకం**

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సిటీలో ప్రజల రక్షణ కోసం పోలీసులు వినూత్న ప్రయోగం చేస్తున్నారు. పోలీస్ తరహాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రగ్స్, మహిళల భద్రత, సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్

మిగతా 2 లో




## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు

**జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సమీక్షా**

**ఎన్నికల ఏర్పాటుతో పాటు ఇతర అంశాలపై చర్చ**

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ జాబితా, పోలింగ్ బూత్‌ల ఏర్పాటుతో పాటు ఇతర

మిగతా 2 లో






## బిడ్డ కవితను చూడగానే భావోద్వేగానికి లోనైన కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): తన బిడ్డ కవితను చూడగానే తండ్రి కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. తండ్రి పాదాలకు కవిత నమస్కరించారు. బిడ్డను ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని

మిగతా 2 లో



## నెక్లెస్ రోడ్డులో ఆల్ ఇండియా హార్టికల్చర్ మేళా

**16వ ఆలిండియా హార్టికల్చర్ మేళాను ప్రారంభించనున్నట్టు వెల్లడి**

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ వాసులకు శుభవార్త. గురువారం నుంచి నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఆల్ ఇండియా హార్టికల్చర్

మిగతా 2 లో

# గణేష్ ఉత్సవాల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

మొదటి పేజీ తరువాయి

ఉండాలన్నారు. అందరి సలహాలు, సూచనలు స్వీకరించేందుకే ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. నగరంలో ఎక్కడ ఉత్సవాలు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దరఖాస్తులను పరిశీలించి మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. చిత్తశుద్ధి, నిబద్దతతో ఉత్సవాలు నిర్వహించేలా జాగ్రత్త వహించండని సూచించారు. నిమజ్జనానికి సంబంధించి ఉత్సవ నిర్వాహకుల నుంచి సహకారం అవసరం అన్నారు. ఏరియాల వారీగా నిమజ్జనానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతీ ఏరియాలో కోఆర్డినేషన్ కమిటీలను నియమించుకోవాలని సూచించారు. వీవీఐపీ సెక్యూరిటీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

# నెక్లెస్ రోడ్డులో ఆల్ ఇండియా హార్టికల్చర్ మేళా



మొదటి పేజీ తరువాయి

మేళా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ విషయాన్ని స్వయంగా మేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ పేర్కొన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ ఉత్పత్తులతో 16వ ఆలిండియా హార్టికల్చర్ మేళాను ప్రారంభించనున్నట్టు మేళా ఇన్‌చార్జి వివరించారు. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో గురువారం నుంచి సెప్టెంబర్ 2 వరకు ఐదురోజులపాటు ఈ మేళా ఉంటుందని ఆయన తెలిపారు. ఇక, ఈ మేళాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ మేళా ప్రతిరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పర్యాటకులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ మేరకు మేళా ఇన్‌ఛార్జీ బుధవారం ప్రత్యేక బ్రౌచర్‌ను కూడా ఆవిష్కరించారు. టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్ వంటి నూతను పద్ధతులను ఈ మేళాలో ప్రదర్శిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఏపీ, కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, ముంబై, బెంగళూరు, పుణె, షిర్డీ, కడియం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్స్‌తో 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని ఇన్‌ఛార్జీ వివరించారు. వివిధ రకాల మొక్కలు ఈ స్టాల్స్‌లో ఏర్పాటు చేస్తారు. అరుదైన జాతుల పువ్వులు, రకరకాల మొక్కలు ఈమేళాలో పర్యాటకులను ఆహ్లాదపరచున్నాయి. ఈ మేళాలో ఇంకా వివిధ రకాల పూల మొక్కలు, పండ్ల జాతులు, విత్తనాలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, అగ్రికల్చర్ సైన్స్, మొక్కల పెంపకానికి ఉపయోగపడే పరికరాలు, వస్తువులు మరెన్నో ఉంటాయి.

# డిజాస్టర్ మేనేజ్మెంట్ బలోపేతం చేస్తున్నాం

హైదరాబాద్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో విపత్తులు సంభవించినప్పుడు వాటిని తట్టుకుని ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తీవ్రతను తగ్గించేందుకు, ఆకస్మికంగా ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేలా విపత్తుల నిర్వహణ వ్యవస్థను (డిజాస్టర్ మేనేజ్మెంట్) బలోపేతం చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ తరపున ఒక టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో తొమ్మిది విభాగాల అధికారులతో వరద కార్యాచరణ ప్రణాళికపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, జాయింట్ సెక్రటరీ, రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్మెంట్) ఎస్.హరీశ్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ రాజ్, ప్లానింగ్, వాతావరణ శాఖ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా స్థాయిలో ప్రణాళికలు:**

10 సంవత్సరాల తర్వాత తొలిసారిగా వరదలపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. వరదలతో సంబంధం ఉన్న ప్రతి విభాగం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వరదలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాలలో వరద ముప్పును తగ్గించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. విపత్తు సమయంలో పరిస్థితులు ఎలా ఉన్నా వాటిని అధిగమించేందుకు వీలుగా అధునాతన పరికరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. త్వరలో మరో సమావేశం నిర్వహిస్తామని అన్ని విభాగాలు వరద ముప్పును ఎదుర్కోవడానికి కావలసిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని రావాలన్నారు. హైడ్రా పరిధిలో డిజాస్టర్ మేనేజ్ మెంట్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంత్రికి వివరించారు. గతంలో 30 టీమ్ లు ఉంటే వాటిని 70 కి పెంచామన్నారు. సిబ్బంది సంఖ్యను 1800 నుంచి 3500 వరకు పెంచినట్లు వివరించారు హైడ్రాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి చెప్పారు. హైడ్రాకు అధునిక పరికరాలు అందిస్తామని అవసరమైన ప్రతిపాదనలు పంపిచాలని రంగనాథ్ కు సూచించారు.

# ప్రజల రక్షణ కోసం పోలీసులు వినూత్న ప్రయోగం

మొదటి పేజీ తరువాయి

మానిటరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద భద్రత కోసం ఆ గార్డులను వినియోగించనున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో నేడు నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్ 2024' పేరుతో సదస్సు నిర్వహించనున్నారు. బంజారా హిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సహా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల నిర్వాహకులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన లోగోను సిటీ సీపీ, హెచ్‌సీఎస్‌సీ చైర్మన్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ సిటీగా మారుతున్న హైదరాబాద్‌లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న సెక్యూరిటీ అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సీరియస్

మొదటి పేజీ తరువాయి


తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యత గల స్థానంలో ఉన్న సీఎం కోర్టు తీర్పుపై వ్యాఖ్యలు ఎలా చేస్తారంటూ సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. పొలిటికల్ కామెంట్స్‌కు తాము భయపడమని స్పష్టం చేసింది. మా డ్యూటీ మేం చేస్తామని తెలిపింది. గురువారం రోజున ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తదుపర విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితకు బెయిల్ రావడంపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తన ఓటు బ్యాంకును బీజేపీకి బదిలీ చేసిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే కేవలం 5 నెలల్లో కవితకు బెయిల్ వచ్చిందంటూ వ్యాఖ్యానించారు ఆరోపించారు. ఇదే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన మనీష్ సిసోడియాకు 16 నెలల తర్వాత బెయిల్ వచ్చిన విషయాన్ని రేవంత్ ప్రస్తావించారు గుర్తుచేశారు. కవితకు త్వరగా బెయిల్ రావడం వెనుక బీజేపీ మద్దతు ఉందని అనుమానం వ్యక్తం చేశారు రేవంత్.

# రాష్ట్రంలో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

మొదటి పేజీ తరువాయి

చేశామని గతేడాది ఆగస్టు సమయంలో 250.25 మిలియన్లు సరఫరా అయ్యిందని గతేడాదితో పోలిస్తే 6.35శాతం ఎక్కువ అని పేర్కొంది. పీక్ ఖరీఫ్ సీజన్ అయిన సెప్టెంబర్, అక్టోబర్‌లో 17వేల మెగావాట్ల వరకు డిమాండ్ ఉండవచ్చని వ్యవసాయంతో పాటు ఇతర వినియోగదారులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించినట్లు వివరించారు.





# యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి

మొదటి పేజీ తరువాయి

ఖాళీగానే ఉన్నాయి. గత బీఆర్ఎస్ సర్కారు వర్సిటీల్లో పోస్టులను భర్తీ చేస్తామంటూ ఐదేండ్ల కింద 1,061 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించింది. కానీ ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి వర్సిటీల కామన్ రిక్రూట్మెంట్ బోర్డు వేయాలని 2022 ఏప్రిల్‌లో రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాతి రెండు నెలల్లోనే బోర్డు చైర్మన్‌గా హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషన్ మెంబర్ సెక్రెటరీగా, పలు శాఖల కార్యదర్శులను సభ్యులుగా ప్రకటించింది. దీనికి ఆమోదం కోసం అప్పట్లో గవర్నర్‌కు పంపించగా, ఆమె దాన్ని రాష్ట్రపతి భవన్‌కు పంపించారు. అప్పటి నుంచి ఆ ఫైల్ అక్కడే ఉంది. అయితే, ఆ తర్వాత దాని గురించి బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదు.



## కామన్ రిక్రూట్మెంట్ బోర్డు రద్దు

గవర్నమెంట్ వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ సర్కారు ఇదివరకే ప్రకటించింది. పది, 15 రోజుల్లో వీసీలను నియమిస్తామని, ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను ప్రారంభిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అయితే, యూనివర్సిటీ కామన్ రిక్రూట్మెంట్ బోర్డుపై స్పష్టత వస్తేనే నియామక ప్రక్రియ ముందుకు పోయే పరిస్థితి ఉంది. ప్రస్తుతం బోర్డు అంశం రాష్ట్రపతి పరిధిలో ఉంది. మరోపక్క బోర్డు ద్వారా రిక్రూట్మెంట్ చేస్తే వర్సిటీల స్వయం ప్రతిపత్తి పోతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బోర్డును రద్దు చేసి రాష్ట్రపతి భవన్‌కు ప్రభుత్వం సమాచారం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఆపై గతంలో మాదిరిగా యూనివర్సిటీల పరిధిలోనే నియమకాలు చేపట్టాలని యోచిస్తోంది. దీనికి అనుగుణంగా విద్యాశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు.

# హౌ టు రెస్పెక్ట్ విమెన్ ను పాఠ్యాంశంగా చేరుస్తాం

మొదటి పేజీ తరువాయి

షీ టీం వ్యవస్థ, టీ సేఫ్ యాప్ మహిళలకు భద్రత కల్పించడంతో పాటు భరోసానిస్తుందని అన్నారు. మహిళలపై నేరాలను తగ్గించే విధంగా ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖా గోయల్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ పని చేస్తుందని అభినందించారు. పేదరికం, వెట్టిచాకిరి ఆసరాగా కూలీలు, మహిళలు, పిల్లలను అక్రమ రవాణా చేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మానవ అక్రమ రవాణా నివారణ కోసం దాని చుట్టూ అల్లుకుని ఉన్న ఆర్థిక సమస్యలను ఛేదించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమాజం ఎంతో అభివృద్ధి చెందుతున్న మనుషుల ఆలోచన ధోరణి మారటం లేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళల పట్ల చిన్నచూపు కొనసాగడమే హత్యలకు, మానభంగాలకు కారణమవుతోందని తెలిపారు. మహిళలను సెక్స్ సింబల్‌గా, వ్యాపార వస్తువుగా చూసే విధానం పోవాలన్నారు. అన్ని స్థాయిల్లో మహిళలు ఏదో ఒక రూపంలో వేధింపులు ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమన్నారు. కోల్‌కతాలో ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్‌కు భద్రత లేకపోతే, ఇంకా మహిళలకు ఎక్కడ భద్రత ఉంటుందని మంత్రి ప్రశ్నించారు. పురుషుల మైండ్ సైట్ మారినప్పుడే మహిళలు అన్ని రంగాల్లో సమానంగా రాణించగలుగుతారని పేర్కొన్నారు. నేరస్థులను త్వరగా శిక్షించడంతో పాటు, నేరం జరగకముందే ఆ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలను గౌరవించడాన్ని పాఠశాల స్థాయి నుంచే పాఠ్యాంశంగా బోధిస్తామన్నారు. తమ పిల్లలకి మహిళలను గౌరవించడం నేర్పాలని, లింగ బేధం లేకుండా అమ్మాయి అబ్బాయిలను మధ్య ఎలాంటి వివక్ష చూపకుండా సమానంగా పెంచాలని తల్లిదండ్రులకు హితవు పలికారు. గతంలో బస్టాప్ లో మహిళలు ఒంటరిగా నిలబడాలంటే భయపడేవారు, కానీ బస్ ప్రయాణం కల్పించిన తర్వాత మహిళలు ఎక్కువ సంఖ్యలు బస్టాప్ లో ఉంటున్నారు. దీంతో పోకిరీలు ఆకతాయిలు కిడ్నాప్ల బెడదలు లేవని చెప్పారు. అందుకే మహిళా భద్రత కోసం ఉచిత బస్సు ప్రయాణం తరహాలో మరిన్ని కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలు, చిన్నారులు మీద జరుగుతున్న అఘాయిత్యాలకు గంజాయి వ్యసనం కారణాలుగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో మొత్తం వ్యసనాల నుంచి సమాజాన్ని బయటికి తీసుకొచ్చేలా డ్రగ్స్ మహమ్మారిపై తమ ప్రభుత్వం యుద్ధం చేస్తుందని తెలిపారు. నేరస్తులపై చర్యలు తీసుకునే విధంగా పోలీస్ వ్యవస్థకు తమ ప్రభుత్వం స్వేచ్ఛనిచ్చిందని, ఇక్కడ ఎవరికీ తలవంచకుండా పోలీసులు వ్యవస్థ పని చేయాలని మంత్రి కోరారు. నేరం ప్రాతిపదికన పని చేయాలి తప్ప నేరస్తుడి బ్యాక్‌గ్రౌండ్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. హైడ్రా తరహాలో అందరి పట్ల ఒకే రకంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. గుడిసెలో బతికే ఆడబిడ్డకైనా నేనున్నాను.. అనే భరోసా పోలీస్ శాఖ కల్పించినప్పుడే మహిళ సాధికారత సాధ్యపడుతుందన్నారు. రెండు రోజుల పాటు మానవ అక్రమ రవాణాపై చర్చించి కార్యచరణ రూపొందిస్తే అమలు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క తెలిపారు.

# హైడ్రా పేరుతో బెదిరిస్తే చర్యలు తీసుకుంటాం : సీఎం

మొదటి పేజీ తరువాయి

ఆయన స్పందించారు. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండు మూడేండ్ల కిందటి ఫిర్యాదులను అడ్డంగా పెట్టుకొని కొన్ని చోట్ల రెవిన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అటువంటి వారిపై చర్యలు తప్పవని ఓ ప్రకటనలో రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి వసూళ్లకు పాల్పడే వారిపై ఫోకస్ పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు.

హైడ్రాపై సీఎస్ సమీక్ష.

కాగా హైడ్రాపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం నాడు ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా,ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్టు తెలిపారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై రాష్ట్ర హై-కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణంలోకి తీసుకుంటూ, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకై హైడ్రాకు అధికారాలను, సిబ్బందిని అప్పగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

# బిడ్డ కవితను చూడగానే భావోద్వేగానికి లోనైన కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

ఆశీర్వదించారు. ఎర్రవెల్లి నివాసానికి కవిత తన భర్త, కుమారుడితో కలిసి గురువారం మధ్యాహ్నం వెళ్లారు. ఈ సందర్భంగా కవితకు దిష్టి తీసి స్వాగతం పలికారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను చూడగానే కేసీఆర్ ముఖంలో ఆనందం కనిపించింది. చాలాకాలం తర్వాత ఉత్సాహంతో అధినేత కేసీఆర్ ఉన్నారు. తమ అధినేత సంతోషంలో పార్టీ నాయకులు, సిబ్బంది భాగస్వామ్యం అయ్యారు. కవిత రాకతో ఎర్రవెల్లి కేసీఆర్ నివాసంలో సంతోషం వెల్లివిరిసింది.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు

మొదటి పేజీ తరువాయి

అంశాలపై చర్చించారు. రానున్న నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేసేందుకు అందరూ సమాయత్తం కావాలని ఈ సందర్భంగా కలెక్టర్లను కమిషనర్ ఆదేశించారు. కాగా, మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మొదట సర్పంచ్, తర్వాత జెడ్పీ, ఎంపీటీసీ ఆ తర్వాత మునిసిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6వ తేదీన ఎన్నికల షెడ్యూల్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్, 21వ తేదీన ఫైనల్ ఓటర్ లిస్ట్‌ను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 ఓటర్లు.. 650 ఓట్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈసీ డిసైడ్ అయ్యింది. లోకల్ బాడీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టడంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఎన్నికలకు సిద్ధం అవుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు దక్కించుకోవాలని వ్యూహాలు మొదలుపెట్టగా బీఆర్ఎస్, బీజేపీ లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి.

# ఓటుకు నోటు కేసుపై ముగిసిన విచారణ

**కేసు బదిలీ చేయాలంటూ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పిటిషన్**

**అపోహలతో బదిలీ చేస్తే న్యాయవ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే: ధర్మాసనం**



న్యూ ఢిల్లీ, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): ఓటుకు నోటు కేసుపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. ఈ కేసు ట్రయల్‌ని భోపాల్‌కి బదిలీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. జగదీష్ రెడ్డి దాఖలు చేసిన బదిలీ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణను ముగించింది. ట్రయల్ జరిగే విషయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున స్పెషల్ ప్రాసిక్యూటర్‌ని నియమిస్తామని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. మా న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రతి ఒక్కరి మనస్సులో విశ్వాసం ఉండేలా, మీకు అభ్యంతరం లేకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తాం అని జస్టిస్ గవాయ్ అన్నారు. కేసులో నిందితుడు రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ సీఎంగా ఉన్నారని, దర్యాప్తు సంస్థ ఏసీబీ చూసే హెూం శాఖ కూడా ఆయన వద్దే ఉందని జగదీష్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా మహబూబ్ నగర్‌లో జరిగిన ర్యాలీల్లో పలుమార్లు పోలీసులపై బెదిరింపు ధోరణి ప్రదర్శించారని జగదీష్ రెడ్డి తరుపు న్యాయవాది తెలిపారు. సీఎంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తేనే కేసుపై ప్రభావం ఎలా ఉందో తెలుస్తుందని, ప్రభుత్వం దాఖలు చేసే కౌంటర్ అఫిడవిట్‌లో కూడా వైఖరి మారిందని జగదీష్ రెడ్డి న్యాయవాది తెలిపారు. ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ని నియమించే వ్యవహారాన్ని సుప్రీంకోర్టు నిర్ణయిస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. తెలంగాణకు చెందిన మా సహచరులను సంప్రదించి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని జస్టిస్ గవాయి తెలిపారు. పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నామని త్రిసభ్య ధర్మాసనం ప్రకటించింది. కేవలం అపోహలతో విచారణ బదిలీ చేస్తే మన న్యాయవ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మా న్యాయవ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రతి ఒక్కరి మనస్సులో విశ్వాసం ఉండేలా, మీకు అభ్యంతరం లేకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తాం' అని జస్టిస్ గవాయ్ తెలిపారు. తెలంగాణకు చెందిన తమ సహచరులను సంప్రదించి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని జస్టిస్ గవాయి వెల్లడించారు. పిటిషన్‌పై విచారణను త్రిసభ్య ధర్మాసనం ముగించింది. స్పెషల్ ప్రాసిక్యూటర్‌ని సుప్రీంకోర్టు నియమిస్తుందని ధర్మాసనం వెల్లడించింది. మధ్యాహ్నం 2 గంటలకు తీర్పు వెలువరిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## మమతకు ఎందుకింత అసహనం

బెంగాల్ టైగర్‌గా, ఫైర్‌బ్రాండ్‌గా పాపులారిటీ సంపాదించుకున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన 14 ఏళ్ల పాలనా అనుభవంలో ఇంత వ్యతిరేకత ఎన్నడూ ఎదుర్కోలేదు. కోల్‌కతాలోని ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ట్రయినీ వైద్య విద్యార్థిని అత్యంత దారుణంగా హత్యాచారానికి గురికావడం, ఈ కేసును పరిష్కరించడంలో అడుగడుగునా కనిపించిన లోపాలు ఆమె ప్రతిష్ఠను మసకబారినట్టు చేస్తున్నాయి. ఈ సంఘటన విషయంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ గాని, పోలీసులు గాని కచ్చితంగా అనుసరించాల్సిన నిబంధనలేవీ పాటించలేదు. జూనియర్ వైద్యురాలి శరీరంపై తీవ్రగాయాలు కనిపిస్తున్నా, దారుణం గా హత్యాచారానికి గుర్తైందని ప్రాథమికంగా తెలుస్తున్నా అవేవీ పరిశీలించకుండా, వాస్తవాలు కప్పిపుచ్చి ఆత్మహత్య వల్లనే చనిపోయిందని మొదట ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించడం, అసహజ మరణంగా నమోదు చేయడం అనుమానాలకు దారి తీశాయి. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడంలో కొన్నిగంటల పాటు ఆలస్యం చేయడం, అలాగే తమ కుమార్తె భౌతిక కాయాన్ని చూడడానికి తల్లిదండ్రులను కొన్ని గంటల పాటు అడ్డుకోవడం వివాదాస్పదమైంది. ఈ కేసును చేపట్టడంలో ఆస్పత్రి వర్గాలు, పోలీస్‌లు సమర్ధంగా నిర్వహించలేకపోయారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగానే ఈ సంఘటనపై మహిళల్లో తీవ్ర ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఒక మహిళా ముఖ్యమంత్రి పాలిస్తున్న రాష్ట్రంలోనే మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. రీ క్లెయిమ్ ది నైట్ ('రీ క్లెయిమ్ ది నైట్ అంటే అర్ధరాత్రి స్వాతంత్ర్యం మహిళలకు కల్పించాలి') అన్న నినాదంతో ఆందోళన వ్యాపించింది. అయితే బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని తొలగించడానికి ఎలా ఆందోళనలు సాగాయో అదే తరహాలో తన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి వామపక్షాలు, ఇతర విపక్షాలు (రావ్‌బావ్ వర్గాలు) ఆందోళనలను రెచ్చగొడుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిని ఆగస్టు 15 తెల్లవారు జామున అల్లరి మూకలు ధ్వంసం చేయడానికి బరి తెగించినప్పుడు అక్కడే రక్షణగా ఉన్న పోలీసులు అడ్డుకోలేదు సరికదా కొందరు తమను తాము రక్షించుకోడానికి ఆస్పత్రిలోకి పరుగులు తీయడం అత్యంత వివాదాస్పదమైంది. దాదాపు ఏడు వేల మంది అల్లరి మూకలో తృణమూల్ పార్టీ మద్దతుదారులు ఉండడం దీని వెనుక ముఖ్యమంత్రి ప్రోత్సాహం ఉందన్న అపవాదు వచ్చింది. సాక్షాధారాలను తుడిచిపెట్టడానికే ఈ విధ్వంసం జరిగిందన్న ఆరోపణలు తలెత్తాయి. సుప్రీం ధర్మాసనం కూడా ఇదే అనుమానాన్ని వ్యక్తం చేసింది. పైగా విధ్వంసానికి పాల్పడినవారిలో చాలా మంది రాష్ట్రానికి చెందిన వారు కాదు. కొన్ని వారాల క్రితం చోప్రాలో దంపతులను స్థానిక తృణమూల్ నేత బహిరంగంగా నడిరోడ్డు పైనే చితక బాదుతుంటే బాధితురాలు బాధతో మెలికలు తిరగడం అక్కడి జనం ప్రత్యక్షంగా చూశారు. అలాంటి అల్లరి మూకలే ఎన్నికల సమయంలో హింసాకాండకు పాల్పడ్డారన్నది వాస్తవం. అప్పటి నుంచి ఒక పార్టీ ఆధిపత్యం కలిగిన సమాజంగా రాష్ట్రంపై ముద్రపడింది. అలాంటి దౌర్జన్య మూకలకు రాజకీయ వ్యవస్థ అండగా ఉంటోంది. జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితుడు సివిక్ పోలీసు వాలంటీర్. అతనికి ఆస్పత్రిలోకి, ఎమర్జెన్సీ వార్డు లోకి విచ్చలవిడిగా వెళ్లి రాడానికి అడ్డూఆపూ ఉండేది కాదు. ఇలాంటి సివిక్ పోలీస్ వాలంటీర్ల నియామకం కూడా లోపభూయిష్టంగా ఉంటోంది. అభ్యర్థుల అర్హత నిర్ణయించడంలో వ్యక్తిత్వ పరిశీలన గాని, కనీస జవాబుదారీతనం గాని లేకుండా చేశారు. అధికార పార్టీకి విధేయులుగా ఉంటే చాలు. తృణమూల్ కాంగ్రెస్ విధానాల ఫలితమే ఈ సివిక్ పోలీసు వాలంటీర్ వ్యవస్థకు మూలం. దీని ద్వారా కాంట్రాక్టు పద్ధతిన వాలంటీర్లను నియమించడం జరుగుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇక ఏమాత్రం తనను తాను రక్షించుకునే విధానం పాటించడం ఎవరికీ సంతృప్తి కలిగించదు. ఆర్‌జి కార్ సంఘటనతో ఏర్పడిన రాజకీయ గందర గోళాన్ని నివారించడానికి, తమ పాలనా యంత్రాంగంలో కొనసాగుతున్న లోపాలను పరిష్కరించే పనిని చేపట్టవలసి ఉంటుంది. ఆర్‌జి కార్ సంఘటన కన్నా ముందు రాష్ట్రంలో మహిళలపై హింసాకాండ సంఘటనలు ఎన్నో జరిగాయి. మహిళలకు రాష్ట్రం లో భద్రత లేకుండా పోయింది. 2012 లో పార్కు స్ట్రీట్‌లో కదులుతున్న వాహనంలో మహిళపై హత్యాచారం జరిగింది. 2013లో కామ్‌దునిలో కాలేజీ విద్యార్థినిపై హత్యాచారం జరిగింది. 2014 లో బీర్భూమ్ వద్ద గిరిజన మహిళపై సామూహిక మానభంగం జరిగింది. ఇటీవలనే 2022లో హంసఖలిలో అత్యాచారానికి గురైన టీనేజర్ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనలన్నీ రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చింది తప్ప జవాబుదారీ మరో వైపు బెంగాల్‌లో బిజెపి ఆధ్వర్యంలో 12 గంటల బంద్‌లో చెదురుమదురుగా దౌర్జన్య సంఘటనలు చోటు చేసుకున్నాయి. బంద్‌కు పాక్షిక స్పందన లభించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) బంద్ మద్దతుదారుల మధ్య సంఘర్షణ జరిగింది. ఆ ఘర్షణల్లో అత్యంత ప్రధానమైనది ఉత్తర 24 పరగణాల జిల్లాలోని భట్పారాలో జరిగింది. తమ స్థానిక నాయకుడు ప్రియంగు పాండే కారుపై టిఎంసి గూండాలు అనేక రౌండ్లు కాల్పులు జరిపారని బిజెపి ఆరోపించి, ఆ ఘటనకు సంబంధించినదిగా భావిస్తున్న ఒక వీడియోను సామాజిక మాధ్యమ వేదికల్లో పంచుకున్నది, పాండే గాయపడకుండా తప్పించుకున్నప్పటికీ వాహనం డ్రైవర్‌కు, ఒక పార్టీ కార్యకర్తకు తలపై తూటా గాయాలు తగిలినట్లు, వారిని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు బిజెపి నాయకులు తెలియజేశారు. అయితే, ఆంగ్లో ఇం డియా జ్యూట్ మిల్లు వెలుపల కొందరు వ్యక్తులు ఆ ఇద్దరిని కొట్టారని పోలీసులు చెప్పారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

– గ్రామ గ్రామాన జోరుగా బిజెపి సభ్యత్వ నమోదు
– బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



నర్వ, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నర్వ మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో గురువారం రోజు మండల స్థాయి మరియు బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం కావాలంటే సెప్టెంబర్ 5 నుండి మొదలు కాబోయే బిజెపి సభ్యత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన బిజెపి సభ్యత్వ నమోదు జోరుగా జరగాలని స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పార్టీకి కట్టుబడి ఉండాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటింటికి చేరే వేసే విధంగా కార్యకర్త పనిచేయాలని,పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రాంపురం నర్సింలు,బిజెపి మండల సభ్యత్వ ఇంచార్జ్ జగన్నాథం,సభ్యులు సంజీవ్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షులు రవి వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన జిల్లెల్ల చిన్నారెడ్డి



వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలకటోని పల్లి గ్రామానికి చెందిన గొంది విక్రమార్క రెడ్డి కుమారుడు సాయి వర్ధన్ రెడ్డికి లివర్ ఆపరేషన్ చేయగా చిలకటోని పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాజ శ్రీనివాసులు చొరవతో గురువారం రోజు 60 వేల రూపాయల విలువ గల చెక్కును బాధితుడు గొంది సాయి వర్ధన్ రెడ్డి తండ్రి గొంది విక్రమార్క రెడ్డికి వనపర్తి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి కార్యాలయం దగ్గర అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులతో పాటు గొంది విక్రమార్క రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలమూరు ఆంజనేయులు బాజ శ్రీనివాసులు ముమ్మల పెద్ద వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఈఓ, ఎంఈఓ ప్రమోషన్లు ఇవ్వాలి

♦ తపస్ జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి




పెబ్బేరు, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): తపస్ పెబ్బేరు శ్రీరంగాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం పెబ్బేరు శ్రీరంగాపూర్ ఉమ్మడి మండలంలోని వివిధ ఉన్నత ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తపస్ జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, జిల్లా సాంస్కృతిక కన్వీనర్ సుదర్శన్, జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్, జిల్లా టెక్నికల్ కన్వీనర్ మల్లేష్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ సతీష్ కుమార్, మండల కార్యదర్శి సురేందర్ సురేష్ తదితర తపస్ ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏకీకృత సర్వీస్ రూల్స్ ను క్లియర్ చేసి డిప్యూటీ ఈవో ఎంఈఓ జూనియర్ లెక్చరర్ డైట్ లెక్చరర్ ప్రమోషన్లు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 5 డిఏ లతోపాటు పిఆర్సి నీ వెంటనే అమలు చేయాలని కేజీబీవీ SSA ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ మినిమం టైం స్కేల్ ఇవ్వాలని బీఈడి చేసిన ఎస్ జి టి ఉపాధ్యాయులకు కూడా ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా అవకాశం కల్పించాలని మోడల్ స్కూల్ గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.

## రుణమాఫీ కానీ రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

■ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ముందు ధర్నా




అమరచింత, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): అమరచింత మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేయాలని రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా యూనియన్ బ్యాంకు ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గోపి మండల నాయకులు వెంకటేష్ రమేష్ అజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిపోస్టులో రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది కానీ రైతులకు 18 వేల కోట్ల రూపాయలు మాత్రమే రుణమాఫీ చేయడం ఇంకా 12 వేల కోట్ల రూపాయలు రైతుల రుణమాఫీకి పెండింగ్ ఉన్నాయి. కావున ఇప్పటికీ చేసినా రుణమాఫీ లిస్టులో లేని రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ ఆఫీస్ యూనియన్ బ్యాంక్ సిబ్బంది రైతులను షరతులతో ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు అమరచింత యూనియన్ బ్యాంకులు 78 00 అకౌంట్లో రైతుల పేర్లు రుణమాఫీ కోసం పంపిస్తే ఇప్పటికి 3000 అకౌంట్లో రైతులకు మాత్రమే రుణమాఫీ వచ్చింది ఇంకా దాదాపు 4800 అకౌంట్లో రైతులకు రుణమాఫీ కాలేదు వెంటనే రైతులకు బడ్జెట్ విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బుచ్చన్న శ్యాంసుందర్ రాఘవేంద్ర తిరుమలి శ్రీను విమనేల్ శ్రీను వెంకటేష్ జాంగిర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ అధిక సభ్యత్వాలు చేయాలి

♦ స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
♦ బూత్ స్థాయి, కార్యకర్తల సమావేశంలో



అమరచింత, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో అమరచింత బీజేపీ నగర శాఖ మరియు మండల శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తల బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి సభ్యత్వ నమోదు కన్వీనర్లు కర్నే స్వామి,బాలరాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సెప్టెంబర్ మూడవ తారీకు నుండి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ పార్టీలోకి నూతనంగా వచ్చే వారికి భారీ ఎత్తున సభ్యత్వాలు చేర్పించాలని కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి తోడ్పడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజలకు అర్థమయ్యే విధంగా ఇంటింటికి చేరేసే విధంగా కార్యకర్తలు పనిచేయాలని భారీ ఎత్తున బిజెపి పార్టీకి పార్టీ సభ్యత్వాలు తీసుకురావాలని, స్థానిక సంస్థల ఎన్నికలు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని, తమ వంతు కర్తవ్యంతో బూత్ స్థాయి ఏజెంట్లు బూతులను బలోపేతం చేసే విధంగా పనిచేయాలని పలు సూచన సలహాలను తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నాగారం, ఆగస్టు 29 ( తీన్మార్ ప్రతినిధి): మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు ఆర్ఎల్ నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్ తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని వార్డులకు నిధులు కేటాయిస్తూ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. పనులు సకాలంలో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బుదవరం లక్ష్మి వేణుగోపాల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బిఫార్మసీ విద్యార్థిని మృతి



గరిడేపల్లి, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): రోడ్డు ప్రమాదంలో బిఫార్మసీ విద్యార్థిని మృతి చెందిన సంఘటన గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన పిడమర్తి స్రవంతి(21), పాలకవీడు మండలం గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన బంక నాగరాజు (25) ఇరువురు కలిసి ద్విచక్ర వాహనం మీద హుజూర్ నగర్ నుంచి గరిడేపల్లి వచ్చే క్రమంలో అప్పన్నపేట గ్రామ శివారులోని చేరుకునేసరికి హుజూర్ నగర్ నుంచి మిర్యాలగూడ వెళ్తున్న లారీ మృతురాలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టడం తో స్రవంతి అక్కడికక్కడే మరణించగా, తీవ్ర గాయాలు అయిన నాగరాజు ను చికిత్స నిమిత్తమై హుజూర్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. కాగా నాగరాజు ప్రస్తుతం హుజూర్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## పోచమ్మ బోనాల జాతరలో సతీసమేతంగా పాల్గొన్న నాయిని



హనుమకొండ, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): ప్రతి సంవత్సరం శ్రావణ మాసం చివరీ గురువారం రోజున ఎంతో వైభవంగా నిర్వహించే 31డివిజన్ న్యూ శాయంపేట పోచమ్మ తల్లి బోనాల జాతరలో సతీసమేతంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నాయిని నీలిమ రెడ్డి మరియు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ. మొదటగా న్యూ శాయంపేట కేంద్రంనుంచి కొబ్బరికాయ కొట్టి అమ్మవారి రథాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ మైనారిటీ కమీషనర్ సయ్యద్ షెహేజాది పర్యటన



వనపర్తి, నియోజకవర్గం, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): జాతీయ మైనార్టీ కమిషనర్ మెంబర్ సయ్యద్ షెహెజాది, గురువారం వనపర్తికి విచ్చేసిన సందర్భంగా మైనారిటి స్కూల్ తనిఖీ మీటింగ్ నిర్వయించారు. తర్వాత బిజెపి జిల్లా ప్రెసిడెంట్ నారాయణ గారు ఇంటికి, మైనారిటీ కమిషన్ మెంబర్ ని సాధారంగా ఆహ్వానించారు. వారి వెంట వనపర్తి జిల్లా మహిళా మోర్చా నాయకురాలు అశ్విని రాధా, స్వామి అందరూ హాజరు హాజరయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సతీ సమేతంగా మైనారిటీ కమీషనర్ సయ్యద్ షేహేజాది ని సన్మానించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. తర్వాత జిల్లా మహిళా మోర్చా టీమ్, టౌన్ మహిళా మోర్చా జాతీయ మైనారిటీ కమీషనర్ ని. ఏబీవీపీ నాయకులు యువమోర్చ అధ్యక్షులు నాయకులు, అందరు సన్మానించారు.

# మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

**– ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా**

అమరచింత, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐవైఎఫ్ నాయకులు తో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కుతుబ్ మాట్లాడుతూ ఒకటో వార్డు షాదిఖాన పక్కన ఉన్న మురుగునీటిని తొలగించాలని అక్కడ ప్రత్యేక కాలువను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త బస్టాండులో మహిళలకు మరుగుదొడ్లు మూత్రశాలలు నిర్మించాలని ప్రధాన రహదారుల వెంట ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూడో వార్డులోని కాళికాదేవి గుడి ముందు నిల్వ ఉన్న మురికి నీటిని పక్కన ఉన్న మురికి నీటిని డ్రైనేజీ కి కలపాలని డిమాండ్ చేశారు నాలుగో




వార్డులో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని పట్టణంలో వీధి దీపాలు కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కమిషనర్ కు వినతిపత్రం అందించారు ఈ కార్యక్రమంలో మార్కింగ్ అనురాగ్ మహబూబ్ వరుణ్ ముస్తఫా అక్షయ్ పాల్గొన్నారు.

# ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణం

**♦ కాంటెస్టేడ్ స్వతంత్ర ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్**

వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్ ): వనపర్తి పట్టణంలో వనపర్తి నియోజకవర్గ కాంటెస్టేడ్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్ క్రీడా రంగంలో దేశఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా తెలిసేలా చేసిన హాకీ క్రీడలలో దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణం తెలిపారు. మూడు సార్లు ఒలింపిక్స్ లో హాకీ ని స్వర్ణ యుగంగా మార్చి తనదైనా క్రీడా నైపుణ్యంతో హిట్లర్ సైతం ఆశ్చర్యానికి గురిచేసి మేజర్ ధ్యాన్ చంద్ దేశ భక్తి ని చాటు కున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం లో క్రీడలలో రానిస్తున్న ప్రతి ఒక్క క్రీడాకారుని అభినందించుట గౌరవంగా చెప్పవచ్చు. భారత దేశంలో యువత సంఖ్య జనాభా సంఖ్య అధికం కాని ప్రస్తుత ఒలింపిక్స్ లో పతకాల సంఖ్య ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు క్రీడలకు మరియు క్రీడా కారులకు చేసే అభివృద్ధి మాటలలో కాకుండా చేసే పని కర్తవ్యంలో చూపిస్తే క్రీడలు అభివృద్ధి చెంతాయని తేలిపారు.ఒక వ్యక్తి



మానసికంగా, శారీరకంగా, సాంఘికంగా అభివృద్ధి చెందాలంటే క్రీడా ప్రాంగణాలు అవసరం అని తెలిపారు.

# ఎమ్మెల్సీ కవితకు బెల్ రావడం హర్షణీయం

**• కె.రఘుపతి రెడ్డి మాజీ జెడ్పిటిసి**



వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): సుదీర్ఘకాలం తర్వాత ఎమ్మెల్సీ కవితకి బెయిల్ రావడం హర్షించ దగ్గ విషయమని పెద్దమందడి మాజీ జెడ్పిటిసి కె.రఘుపతి రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో మాజీ జెడ్పిటిసి మాట్లాడుతూ, సుదీర్ఘకాలం తర్వాత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కి బెయిల్ రావడంతో టిఆర్ఎస్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఆమెకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు కీలక వాక్యాలు చేసిందన్నారు. ఈ కేసులపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఫోర్మేంట్ డైరెక్టర్, మరియు సిబిఐ తీర్పు పై కోర్టు అభ్యంతరం తెలిపింది. ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్స్ జస్టిస్ బిఆర్. గవాయ్, జస్టిస్ విశ్వనాథన్, కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈడి, సిబిఐ లను, ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం, కేంద్ర దర్యాప్తు సంస్థల నిష్పక్షపాత వైఖరి పై అనుమానాలు వ్యక్తం చేసింది. ఎవరినైనా ఎంపిక చేసుకొని నిందితులుగా పేర్కొంటారా...? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది నా, విషయం గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఈడీ, సీబీఐల తీరును ఎండగట్టిన ధర్మాసనం, కేవలం అప్రూవర్లు గా మారిన మాజీ నిందితుల వాంగ్మూలా ల పైన ఆధారపడలేదని పేర్కొంది. మీరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి అని కోర్టు చివాట్లు పెట్టింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సాక్షిగా మారారా..? ఎంపిక చేసుకున్నంత మాత్రాన వారిని నిందితులుగా చూస్తారా అని కోర్టు సూటిగా ప్రశ్నించింది. ఇందులో న్యాయమేక్కడ..? అని అని ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉందని చెప్పేందుకు మీ దగ్గర ఉన్న ఆధారాలు ఏంటని ఈడీ, సిబిఐ లను ధర్మాసనం ప్రశ్నించిందని అన్నారు. చివరిగా న్యాయమే గెలిచిందని, ఎమ్మెల్సీ కవిత గారు కడిగిన ముత్యంల బయటికి వస్తుందన్న కేసీఆర్ మాటను నిజం చేస్తూ, రాజకీయ కుట్రలో భాగంగా తెలంగాణ సాధన ఉద్యమ నాయకురాలిని అక్రమ అరెస్టు చేసి 166 రోజులు అకారణంగా రాజకీయ ప్రేరేపిత చర్యలో, భాగంగా జైల్లో ఉంచి మహిళా అని చూడకుండా ఇబ్బందికి గురి చేశారన్నారు. నమ్మిన న్యాయ పోరాటంలో చివరికి న్యాయం, ధర్మమే గెలిచిందన్నారు. బతుకమ్మ ద్వారా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా తెలిసే తెలియజేసిన ఎమ్మెల్సీ కవిత గారికి ధన్యవాదములు తెలిపారు. చివరికి ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది అన్నారు. ఎమ్మెల్సీ కవిత గారికి దేశ అత్యుత్తమ సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇది శుభ సూచికం, సంతోషం, హర్షనీయమంటూ పెద్దమందడి మాజీ జెడ్పిటిసి కె.రఘుపతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# పంచాయతీ ఓటర్ జాబితా రూపకల్పన పటిష్ట చర్యలు

**– రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారధి**
**– పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల గుర్తింపు**

ములుగు జిల్లా, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): పంచాయతీ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి హైదరాబాద్ నుంచి పంచాయతీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధత పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాడ్వాయి తహసిల్దార్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ ఫోటోతో కూడిన ఓటర్ జాబితా రూపకల్పన చేయాలని అన్నారు. ఓటరు జాబితా నుంచి గ్రామ





పంచాయతీ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వార్డుల వారీగా కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆయన సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు గ్రామంలోని వార్డుల వారీగా అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్ లను తనిఖీ చేసి అవసరమైన మరమ్మత్తులు నిర్వహించాలని, మొదటి దశ బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర సిబ్బందిని గుర్తించి వారి వివరాలు అందజేయాలని, రిటర్నింగ్ అధికారులు, ప్రిసీడింగ్ అధికారులుగా విధులు నిర్వహించే వారికి అవసరమైన శిక్షణ అందించేందుకు వీలుగా ప్రతి జిల్లా నుంచి 10 మంది రిసోర్స్ పర్సన్ ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి శిక్షణకు పంపాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు వివిధ దశలలో జరుగుతాయని, దానికి సంబంధించి ముద్రించాల్సిన బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రేస్ మొదలగు అంశాలను ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ములుగు, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): జాతీయ క్రీడ దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగులో ఘనంగా నిర్వహించ డమైనది. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె సోమన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత క్రీడారంగా నికి ప్రత్యేకంగా హాకీ క్రీడకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ సేవలను కొనియాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తిని చూపినప్పుడే శారీరక మరియు మానసిక వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులకు కళాశాల అన్ని రంగాల్లో అండగా ఉంటుందని పేర్కొన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె సోమన్న మాట్లాడుతూ 1928, 1932 మరియు 1936 ఒలంపిక్ క్రీడల్లో భారత హాకీ జట్టు ధ్యాన్ చంద్ అసమాన క్రీడా సామర్థ్యం వలన బంగారు పతకాన్ని గెలిచిందని పేర్కొన్నారు. భారత హాకీ కి ఎనలేని సేవలందించిన గొప్ప వ్యక్తి మేజర్ ధ్యాన్ చంద్ అని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి బాలయ్య మాట్లాడుతూ నేటి యువత ధ్యాన్ చంద్ ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్. భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ అన్ని రంగాల్లో ముందుండాలని కోరాడు. కళాశాల న్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. కవిత మాట్లాడుతూ విద్యార్థులు అకాడమిక్ అంశాలే కాకుండా క్రీడలు వంటి అంశాల పట్ల కూడా ఆసక్తి చూపినప్పుడే విజయం సాధ్యమవు తుందని తెలిపారు.వందమంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డి. రాధిక, కే. సరిత, పి. నాగమణి, బి. శిరీష, ఎం. అనిల్ కుమార్, పి. ఉదయశ్రీ, పి. విజిత, జె. శంకర్, ఆర్. తేజోలత, టి. శ్రీను, హెచ్ రమేష్ మరియు కే. లక్ష్మి, వి. ఐలయ్య, ఎస్కే షరీఫా తదితరులు హాజరయ్యారు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో క్రీడలు

మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కారంచుకోని గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులకు జిల్లా క్రీడా, యువజన శాఖ ఆధ్వర్యంలో టాగ్గా ఫర్, చదరంగం, మ్యూజికల్ చెర్, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో టాగ్గా ఫర్, పురుషుల విభాగంలో జిల్లా మాత్య శాఖ, మహిళా విభాగంలో మొదటి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, రెండవ స్థానంలో రెవెన్యూ శాఖ, మ్యూజికల్ చెర్ లో మొదటి బహుమతి డి. శిరీష, రెండవ బహుమతి ఎండి.హాసిన, విద్యా శాఖ, లకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా అధికారి బి. అనిల్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, బిసి సంక్షేమ అధికారి నరసింహస్వామి, ఏడి సర్వే ల్యాండ్



అధికారి నరసింహమూర్తి, జిల్లా మాత్య శాఖ అధికారి వీరన్న, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**– రూ. 25 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం**
**– కార్పొరేటర్ శారదామనోధరెడ్డి**

జవహర్ నగర్, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): ప్రగతి పనులతో డివిజన్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ శారదా మనోధర్ రెడ్డి అన్నారు. జవహర్నగర్ కార్పొరేషన్లోని 9వ డివిజన్ సంతోష్ నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.25లక్షలతో కార్పొరేటర్ శారదామనోధరెడ్డి ఆధ్వర్యంలో మేయర్ శాంతి సమక్షంలో 600మీటర్ల భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శారదా మనోధరెడ్డి మాట్లాడుతూ డివిజన్ అంతాటా మంచినీటి నల్లా కనెక్షన్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని అన్నారు. కార్పొరేషన్లో 9వ డివిజన్ను అభివృద్ధిలో ముందంజలో ఉంచుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ తాజ్మాహరెడ్డి, కార్పొరేటర్ నవీన్, కాంగ్రెస్ పార్టీ



అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్యాదవ్, నాయకులు బుజ్జి, దయాకరాచారి, బహదూర్ అలీ, బిక్షపతిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా కలెక్టరెట్ సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహల్లో సోలార్, ఆర్ ఓ.ప్లాంట్ ఏర్పాటు చేయాలి. మంచినీటి సరఫరాపై నివేదికలు ఇవ్వాలి, మురుగునీటి నిల్వలు లేకుండా కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించాలి, విద్యుత్ సౌకర్యం లేని పాఠశాలల జాభితా ఇవ్వాలి, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు బెడ్లు ఇచ్చేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలి, మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు తనిఖీ చేయాలి. భోజన, అల్పాహారం నాణ్యత పరిశీలనకు విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణ చర్యలు, వసతి గృహల్లో సోలార్, ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, మహిళాశక్తి తదితర అంశాలపై పంచాయతి రాజ్, విద్యా, డిఆర్డీఏ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, ఎంపీవోలు, పంచాయతి రాజ్, గిరిజన సంక్షేమ, టిజిఈ డబ్ల్యూఐడిసి, ఆర్ డబ్ల్యూ ఎస్, డిపియం, ఏపీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధులపై తక్షణం స్పందించాలని సూచించారు. డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలకుండా మండల ప్రత్యేక అధికారులు వైద్య సేవలు పర్యవేక్షణ చేయాలని అన్నారు. వ్యాది ప్రబలే ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి జ్వరాలు ప్రబల కుండా నియంత్రణ చేయాలని తెలిపారు. జ్వర పీడి తులు ఎక్కువగా ఉండే గ్రామాలను గుర్తించి వారిని ప్రభుత్వాసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. టి హబ్ ద్వారా వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగా హన కల్పించాలని, వైద్య పరీక్షల రిపోర్టులు ఆధారంగా తక్షణమే వైద్య సేవలు అందించాలని సూచించారు.

వసతి గృహాల్లో సోలార్, ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని గతంలో జరిగిన సమావేశంలో ఆదేశాలు ఇచ్చామని నేటి వరకు ఒక్కరూ ప్రతిపాదనలు ఇవ్వలేదని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, అన్ని శాఖల వసతి గృహాలు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎలాంటి సమాచారం లేకుండా అకస్మాత్తుగా తనిఖీలు చేయాలని సమాచారం తెలియకుండా గోప్యత పాటించాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఓ లు సంయుక్తంగా ప్రతిపాదనలు అందచేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరిగిన పనులకు చెల్లింపులు చేసేందుకు ఎం.బి ఆధారంగా బిల్లులు చెల్లింపుకు నిధులు. మంజూరు చేస్తామని అన్నారు. జిల్లాలో 265 పాఠశాలల్లో పనులు చేపట్టగా 182 పాఠశాలల్లో మొత్తం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన 83 పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఎంపిడిఓ, ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టరేట్ నందు వారం రోజుల్లో మహిళా శక్తి కాంటీన్ ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ అధికారులను ఆదేశించారు. చెల్పూర్ లో మిల్లెట్ ప్రాసిసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మాణం కూడా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఓ నారాయణ రావు, జడ్పి సీఈవో విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మండల ప్రత్యేక అధికారులు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వం



## పరకాల శాసనసభ్యులు రేవురి ప్రకాశ్ రెడ్డి

పరకాల, ఆగస్టు 29 (తీన్మార్ న్యూస్): పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పరకాల శాసనసభ్యులు రేవురి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్ మరియు మండలం కు చెందిన 15 మంది లబ్ధిదారులకు 15 లక్షల 1740 విలువ గల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మరియు 39 మంది లబ్ధిదారులకు 11 లక్షల 87500 రూపాయల విలువ గల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సిఎం అర్ ఎఫ్ పేద ప్రజలకు వరమని గతంలో ఎమ్మెల్యే,ఎంపి ల కార్యాల యాల వద్ద చెక్కుల కోసం పడిగాపులు కాచేవారని నేడు లబ్దిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందని అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో పంపిణీ చేసామని అన్నారు. ఇప్పటివరకు పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం కళ్యాణలక్ష్మి పథకం ద్వారా 874 మంది లబ్ధిదారులకు 8కోట్ల 75 లక్షల ఒక వేయి184 రూపాయలు చెక్కులు పంపిణీ చేశామని, అలాగే 609 మంది లబ్ధిదారులకు 1 కోటి 93 లక్షల 61వేల 600 విలువ కదా సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని అన్నారు. మొత్తం 1,483 మంది లబ్ధిదారులకు రూ? 10 కోట్ల 68 లక్షల 62 వేల 984 రూపాయలు పంపిణీ చేసామన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామని అన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరఫున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం సహాయ నిధి పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ, అర్హులైన పేదలకు న్యాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందని అన్నారు. గత 10 సంవత్సరాల బి ఆర్ స్ పాలనలో తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రముగా మార్చి రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా నిరుపేదలకు అందించాల్సిన కళ్యాణ లక్ష్మి పథకం,సీఎంఆర్ఎఫ్ లో కూడా అవినీతికి పాల్పడిందని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రతి పేదవాడి ఆదుకోవాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో పెండింగ్ లో ఉన్న కళ్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా మంజూరు చేసి అందించిన సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అన్నారు.



# జిల్లాలో అల్లోపతి నకిలీ వైద్యులపై ఆకస్మిక తనిఖీలు

పెద్దపల్లి: రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ డా. మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాల మేరకు సభ్యులు డా. రాజకుమార్ ఆధ్వర్యంలో టిజీఎంసి తనిఖీ బృందం పెద్దపల్లి, సుల్తానాబాద్ లలో నకిలీ అల్లోపతి వైద్యుల సెంటర్స్ పై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పెద్దపల్లిలోని లోటస్ హాస్పిటల్, పురుషోత్తం, ఇమ్రాన్ బోన్ సెట్టింగ్స్ సెంటర్, వైఎస్అజీజ్ క్లినిక్, సుల్తానాబాద్ లోని నీలకంటేశ్వర్ మెడికల్ షాప్ మల్లేశం, మణికంఠ క్లినిక్ చిన్న రమేష్ పేరుతో అర్హత లేకుండా పలు సెంటర్స్ ఓపెన్ చేసి వైద్యం చేస్తున్నారని వెలుగులోకి వచ్చిందని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ఈ తనిఖీల గురించి సమాచారం తెలుసుకుని నకిలీ వైద్యులు వారి క్లినిక్ లు, ల్యాబ్స్, పర్మిషన్ లేని మెడికల్ షాపులు మూసి వేశారని పేర్కొన్నారు. అర్హతలేనివారు వైద్యులుగా చెలామణి అవుతూ ఆంటిబయోటిక్స్, స్టెరోయిడ్స్ ఇస్తున్నట్టు గుర్తించి తగు ఆధారాలు సేకరించామని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ఎన్ఎంసి చట్టం 34,54 ప్రకారం వీరిపై కేసు నమోదు చేయనున్నారు.

ఈ తనిఖీలలో కరీంనగర్ ఆంటీ క్వాకరీ బృందం సభ్యులు హెచ్ ఆర్ డి ఏ సెక్రటరీలు డా. శరణ్ సాయి, సందీప్, భరత్, ఇతర బృందం పాల్గొన్నారు. టీజీఎంసి మెంబర్ డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రమంతటా 30 బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

# పల్లెరుచుల్ పికిల్స్ ప్రొడక్ట్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల: పట్టణంలోని బీట్ బజార్ లో పల్లెరుచుల్ పికిల్స్ ప్రొడక్ట్ సెంటర్ ను బుధవారం కరీంనగర్ పట్టభద్రులఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి -లక్ష్మణ్ తోకలసి ప్రారంభించారు..ఈ సంధర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధం అయిన ఎ పరిశ్రమనైనా ఉత్పత్తి ఎంత ప్రాధాన్యత సంచరించుకుంటదో మార్కెటింగ్ కూడా అంతే ప్రదానం ఉత్పత్తి తో ఎంత ఆదాయం పొందుతమో మార్కెటింగ్ తో అంతకంటే రెట్టింపు ఆదాయం పొందుతాం అన్నారు.మార్కెటింగ్ ద్వారా పొందే ఆదాయాన్ని ఉత్పత్తిదారుడే పొందగలిగినట్టయితే మెరుగైనటువంటి ఆదాయాన్ని పొందే అవకాశం లభిస్తుందన్నారు.ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి వివిధ రకాలైనటువంటి సహకారాలు లభిస్తున్నాయిని,జగిత్యాల ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసుకోవడానికి చిన్నచిన్న పారిశ్రామికవేత్తలు రైతాంగం ముందుకు రావాలని, సురేష్ స్వయంగా ఒక డైరీ ఫామ్ ఏర్పాటు చేసుకొని పాల ఉత్పత్తి చేసుకుంటూ పల్లెరుచుల్ పికిల్ ప్రారంభించడం అభినందనీయం అన్నారు.వారి కుటుంబ సభ్యులు వ్యవసాయంతో పాటు వ్యాపారాలలో తోడు నిలవడం అభినందకరం అన్నారు. సురేశ్ వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

వారి వెంట కౌన్సిలర్ దుర్గన్న, మాజీ కౌన్సిలర్స్ బింగిరవి,రజనీకాంత్, తదితరులు ఉన్నారు.

# పేద ప్రజలను పావులుగా వాడుకున్నారు

సికింద్రాబాద్: పేద ప్రజలను పావులుగా వాడుకొని అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు కొంతమంది బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాష్ ఆరోపించారు. ఓల్డ్ బోయిన్ పల్లిలోని అస్మత్ పేట్ (బోయిని) చెరువు ప్రాంతంలో ఉన్న 400అక్రమ నిర్మాణాలకు హైడ్రా నోటీస్ ఇచ్చారు. అందులో హరిజన బస్తీ వాసులు 90మందికి కూడా నోటీసులు అందాయి. ఈ విషయం ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి వెళ్ళగా ఆ ప్రాంతాన్ని సందర్శించడానికి ఈ రోజు రానున్నట్లు సమాచారం ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కలసి చెరువు కట్ట మీద మీటింగ్ పెట్టే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కన్నె ప్రకాష్ అక్కడికి చేరుకొని హరిజన బస్తీ వాసులకు అండగా నిలిచారు.. ఏ నాయకుడు వచ్చినా, అధికారులు వచ్చిన హరిజన భస్థిలోకి వచ్చే మాట్లాడాలని కోరారు. కొంతమంది బీజేపీ నాయకులే 8ఎకరాల చెరువు భూమిని ఆక్రమించిన వారికి లాభం చేకూర్చడానికి కట్ట మీద మీటింగ్ పెడుతున్నారని వెల్లడించారు.. ఈ పేద ప్రజలు 40ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలంలో పట్టాలివ్వలని డిమాండ్ చేశారు.. ఎంపీ ఈటల కూడా విషయం గ్రహించి పేద ప్రజల ఇళ్ల మధ్యలోకి వచ్చి చూడాలని కోరారు..

# నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తితో సహా.. ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**– గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లో గతంలో కేసు నమోదు.**

సిరిసిల్ల: నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన వారిని అరెస్టు చూపిన అనంతరం మాట్లాడుతూ.. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ అనే వ్యక్తి నాటు తుపాకులు తయారు చేసి వాటిని అదే గ్రామానికి చెందిన అడవి జంతువులను వేటాడే వారికి అమ్ముతున్నాడన్నా నమ్మదగిన సమాచారం రాగా గంభీరావుపేట ఎస్.ఐ తన సిబ్బందిని తీసుకొని గజసింగవరం గ్రామంలోని రాయలింగు శంకర్ ఇంటికి వెళ్ళగా అక్కడ రాయలింగు శంకర్ వివిధ పనిముట్ల ఉపయోగించి నాటు తుపాకులు తయారు చేస్తుండగా పట్టుకొని, అతని వద్ద రెండు తుపాకి బ్యారెల్, తుపాకుల తయారు చేయడానికి వాడే రంపము, సుత్తి, కత్తి, ఆకు రాయి, డ్రిల్లింగ్ మిషన్ ,దూడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకొని నిందుతున్నీ పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కేసు తదుపరి దర్యాప్తు ప్రారంభించగా దర్యాప్తులో భాగంగా గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ వద్ద నాటు తుపాకులు కొనుగోలు చేసి జంతువుల వేటకు ఉపయోగిస్తున్న రాయలింగు




చంద్రమౌళి, శాతవేణిహరీష్ లోగిడి గంగయ్య లను అదుపులోకి తీసుకొని వారి వద్ద రెండు తుపాకులు నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకొవడం జరిగిందని నలుగురు నిందుతులను రిమాండ్ కి తరలించడం జరిగిందని తెలిపారు.చాకచక్యంగా వ్యవహరించి నింధుతులను అరెస్ట్ చేసిన ఎల్లారెడ్డిపేట్ సి.ఐ శ్రీనివాస్,గంభీరావుపేట ఎస్.ఐ రామ్మోహన్,సిబ్బంది ని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ శ్రీనివాస్, ఎస్ .ఐ లు రామ్మోహన్,రమాకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్ మోసాలతో తస్మాత్ జాగ్రత్త..

హైదరాబాద్ :ప్రస్తుత డిజిటల్ యుగంలో ఫైనాన్షియల్ పేమెంట్ స్కామ్స్ ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి మోసగాళ్లకు భారతదేశం అడ్డాగా మారింది. దీనికి ప్రధాన కారణం భారతదేశం చాలా వేగంగా డిజిటల్ వరల్డ్‌లోకి అడుగుపెట్టడమే. దాదాపు అందరి వద్ద స్మార్ట్‌ఫోన్, దానికి ఇంటర్నెట్ సదుపాయం ఉంది. ప్రతి స్మార్ట్‌ఫోన్ యూజర్ డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. దీంతో స్కామర్లకు ప్రజలను మోసగించడం చాలా ఈజీ అయిపోయింది. పార్ట్ టైమ్ జాబ్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు, యూట్యూబ్ వీడియో స్కామ్‌లు, క్యూఆర్ కోడ్ స్కామ్‌లతో అనేక రకాలుగా ప్రజలను బుట్టలో వేసుకుంటున్నారు. ప్రజలు, వ్యాపారులు ఇలా పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకుంటున్నారు. ప్రస్తుతం వేగంగా పెరుగుతున్న క్యూఆర్ కోడ్ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అసలు క్యూఆర్ స్కామ్ అంటే ఏంటి? వీటి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుసుకుందాం.



## క్యూఆర్ కోడ్ స్కామ్ అంటే ఏంటి?

క్యూఆర్ కోడ్ స్కామ్‌లలో ప్రజలను ట్రాప్ చేయడానికి, స్కామర్‌లు క్యూఆర్ కోడ్‌ని పంపి వారిని టెంప్ట్ చేస్తారు. ముందుగా డబ్బు పంపమని కూడా ప్రలోభపెడతారు. క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి పార్ట్ టైమ్ జాబ్ పొందవచ్చని, స్కాన్ చేసే పేమెంట్ లభిస్తుందని మోసగిస్తారు. కేవలం క్యూఆర్ కోడ్స్‌ని స్కాన్ చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని కూడా ప్రచారం చేస్తున్నారు.

## మోసం ఎలా జరుగుతుంది?

స్కామర్లు నకిలీ క్యూఆర్ కోడ్‌లను క్రియేట్ చేస్తారు. వీటిని స్కాన్ చేసిన వెంటనే ఓ ఫేక్ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. ఆ తర్వాత పేమెంట్ కోసం ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు, లాగిన్ డీటైల్స్ వంటి పర్సనల్ ఇన్ఫర్మేషన్ ఎంటర్ చేయమని కోరుతారు. మీరు వివరాలను ఎంటర్ చేసిన వెంటనే, OTP వస్తుంది. ఆ ఓటీపీని కూడా ఎంటర్ చేస్తే, స్కామర్లకు మీ బ్యాంక్ కౌంట్ యాక్సెస్ లభిస్తుంది. వెంటనే మీ అకౌంట్‌లోని డబ్బుంతా ఖాళీ చేస్తారు.

## ఈ స్కామ్‌లను గుర్తించడం ఎలా?

క్యూఆర్ కోడ్‌లు డబ్బును పంపడం కోసం ఉపయోగపడతాయని, స్వీకరించడానికి కాదని వినియోగదారులు అర్థం చేసుకోవాలి. అలాగే క్యూఆర్ కోడ్‌కి లింక్ చేసిన URL లేదా వెబ్‌సైట్‌ను చెక్ చేయాలి. సెక్యూర్ కనెక్షన్ ఎల్లప్పుడూ "%https%:"తో మొదలవుతుంది. డొమైన్ నేమ్‌లో ఏవైనా స్పెల్లింగ్ మిస్టేక్స్ లేదా అనుమానాస్పద మార్పులను జాగ్రత్తగా పరిశీలించాలి.

## సేఫ్టీ టిప్స్

క్యూఆర్ కోడ్ స్కామ్‌ల నుంచి రక్షణ పొందడానికి యూపీఐ, బ్యాంక్ వివరాలు అపరిచితులతో పంచుకోవడం మానుకోండి. క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేసే ముందు జాగ్రత్త వహించండి. ముఖ్యంగా తెలియని లేదా అనుమానాస్పద సోర్సెస్ నుంచి రిసీవ్ చేసుకున్న క్యూఆర్ కోడ్‌లు నమ్మకూడదు. ఈమెయిళ్ల ద్వారా అందుకున్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసే ముందు, వాటిని సంబంధిత కంపెనీ లేదా సంస్థ ప్రతినిధితో మాట్లాడి, వెరిఫై చేసుకోండి. ఊహించని, టెమ్ట్ చేసే ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండండి.

# ఇక్కడ కావాలి ఓ హైడ్రా..!

- అనేక చోట్ల చెరువులు, కుంటలు అన్యాక్రాంతం
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు అక్రమించి కట్టడాలు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అనేక ఫిర్యాదులు
- ఇక్కడా ఏర్పాటుచేయాలని జిల్లావాసుల డిమాండ్

ఆదిలాబాద్: ప్రజలు, పశవులతో పాటు పంట పొలాలకు సాగు నీరందించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వాలు నివాసాల మద్యలో చెరువులు, కుంటలను ఏర్పాటుచేసింది. మన రాష్ట్రంలో కాకతీయులు, నిజాం కాలంలో ఈ చెరువుల నిర్మాణం అధికంగా జరిగినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. గతంలో ఊరికి కనీసం మూడు చెరువులు ఉండేవని..ఒకటి తాగునీటికి, రెండోది బట్టలు ఉతకడం..మూడోది పంటల కోసం నిర్మించారని చెబుతుంటారు. ఒకప్పుడు వర్షాకాలం రాగానే ఈ చెరువులు, కుంటలు నిండుకుండలా మారి ఎండకాలం చివరి వరకు ప్రజలకు ఉపయోగపడేవి. కానీ కాలానుగుణంగా వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాకు గురవుతూ వచ్చాయి. ముఖ్యంగా పట్టణాల్లో జన సాంద్రత పెరగడంతో ఇండ్లు, ఇతరాత్ర వాటిని చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఫుల్‌లెవల్‌ట్యాంక్ (ఎఫ్‌టీఎల్) పరిధితో పాటు చెరువుకు ఆయకట్టుకు మద్యలో ఉండే బఫర్‌జోన్‌లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై స్థానికుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినా అధికారులు, పాలకులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లా కేంద్రాలతో పాటు ముఖ్య పట్టణాలు, మండల కేంద్రాల్లో అనేక చెరువులు, కుంటలు ఆనవాళ్లు లేకుండా పోయినట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు చేయకూడదనే నిబంధనలు ఉన్నా కొందరు అధికారుల అండగా అక్రమార్కులు వాటిని కబ్జా చేసి ఇతరులకు విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వాటిలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్నట్లు తెలుస్తోంది. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నా..ఇన్నాండ్లు అధికార యంత్రాంగం దృష్టిసారించిన దాఖలాలు లేకుండా పోయాయి. దీంతో ఆయా జిల్లా కేంద్రాల్లోని చెరువుల ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లోనూ అనేక నివాసాలు, ఫామ్‌హౌస్‌లు, ఆస్పత్రులు, వివిధ రకాల నిర్మాణాలు




వెలిసినట్లు తెలుస్తోంది. చెరువులకు సంబంధించిన భూములను సైతం అధికారులతో లోపాయికారి ఒప్పందం మేరకు కొందరు అక్రమంగా పట్టాలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఇక్కడ ఏర్పాటు చేయాలని డిమాండ్..!

ఉమ్మడి జిల్లాలోనూ అనేక చెరువులు, కుంటలతో పాటు విలువైన ప్రభుత్వ స్థలాలు సైతం అన్యాక్రాంతమవుతున్నాయి. అక్రమార్కుల చెరబట్టడంతో కబ్జాకు గురవుతున్నాయి. రియల్‌ఎస్టేట్ పెరిగిన తర్వాత ఈ సమస్య మరింత అధికంగా మారిందని జనం చెబుతున్నారు. ఒకప్పుడు విశాలంగా ఉన్న చెరువులన్ని కాలానుగుణంగా కబ్జాకు గురవుతుండటంతో ఏండ్ల నుంచి పట్టణాలు, మండల కేంద్రాల్లో నివాసముంటున్న జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో అధిక వర్షాలు కురిసిన సమయంలో ఇండ్లు నీటిలో మునిగిపోవడం వంటి విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం హైడ్రా పేరిట హైదరాబాదులో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతుండటంతో ఇలాంటి సంస్థను అన్ని జిల్లాల్లో ఏర్పాటుచేయాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

హైడ్రా వంటి సంస్థ జిల్లాల్లో ఉంటే కనీసం భవిష్యత్తులోనైనా చెరువులు, కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా ఉంటాయని జనం విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలోని కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు సైతం ఈ సంస్థను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజల నుంచి సైతం ఈ డిమాండ్ తెరమీదకు రావడం ఆసక్తికరంగా మారింది.

# ప్రియాంక్ ఖర్గేకు బిగిసిన ఉచ్చు

బెంగళూరు: కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. సీఎంగా సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎంగా డీకే.శివకుమార్ బాధ్యతలు చేపట్టారు. రెండున్నరేళ్ల పద్ధతిలో వీరు బాధ్యలు చేపట్టారు. అయితే ఏడాది పాలనకే కాంగ్రెస్ సర్కార్‌పై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే సీఎం సిద్ధరామయ్య సతీమణి భూ ఆక్రమణపై ఫిర్యాదులు అందడంతో గవర్నర్ విచారణకు ఆదేశించారు. గవర్నర్ ఆదేశాలపై సిద్ధరామయ్య కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదం కొనసాగుతుండగానే సిద్ధరామయ్య ప్రభుత్వం మరో భూకేటాయింపు విషయం వెలుగులోకి వచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖర్గే ట్రస్టుకు రూ.14 కోట్ల విలువైనభూమి కేటాయించింది కర్ణాటక ప్రభుత్వం. ఇదే ఇప్పుడు మరో వివాదమైంది. ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. అక్రమ భూకేటాయింపుల నేపథ్యంలో ప్రియాంక్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సీఎంపై విచారణకు ఆదేశించిన గరవ్నర్.. ఇప్పుడు ప్రియాంక్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మల్లికార్జునఖర్గే స్థాపించిన సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు ఆయన కుమారుడు రాహుల్ ఖర్గే అధ్యక్షత వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో దేవనహళ్లిలోని హైటెక్, డిఫెన్స్ ? ఏరోస్పేస్ పార్క్‌లో 5 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ట్రస్ట్ దరఖాస్తు చేసింది. పార్శిల్ కోసం ట్రస్టు రూ.14 కోట్లు చెల్లిస్తోంది. కర్ణాటక గ్రామీణాభివృద్ధి, పంచాయత్ రాజ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ మంత్రిగా ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఉన్నారు. ఈ నేపథ్యంలో భూమి కేటాయింపు వివాదాస్పదమైంది. బంధుప్రీతి ఆరోపణలపై ఐట్వీ/బీటీ



మంత్రి ప్రియాంక్ ఖర్గేను కేబినెట్ నుంచి తప్పించాలని ప్రతిపక్ష నాయకుడు చలవాడి నారాయణస్వామి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను కోరారు.ఇదిలా ఉంటే దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ ట్రస్టు కొనసాగుతోందని ప్రియాంక్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం తప్పా? ప్రభుత్వం నుండి ప్లాట్లు కొనాలని కోరుకోవడంలో తప్పు ఏమిటి? ఇక్కడ చట్టవిరుద్ధం ఏమిటి? మేము ఎటువంటి సబ్సిడీ లేదా వాయిదా చెల్లింపును కోరలేదు అని ఆయన అన్నారు. తన సోదరుడు రాహుల్ విశిష్టమైన వ్యక్తి అని ప్రియాంక్ అన్నారు. అతను ఎల్‌సీ టాపర్, ఇంజనీరింగ్ టాపర్. అతను మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి, అతను పరిశోధన చేయడానికి నిష్క్రమించాడు. అతను ఐఎస్‌సీ సూపర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఉన్నాడని తెలిపారు.ట్రస్టుకు చట్టప్రకారమే భూమిని కేటాయించినట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. భూమి పొందడానికి ట్రస్టుకు అర్హత ఉందని, అందుకే కేటాయించామని చెప్పారు. ఇందులో ఎలాంటి అవకతవకలు లేవని స్పష్టం చేశారు.

# బఫర్ జోన్ అంటే ఏమిటీ...

హైదరాబాద్: హైదరాబాద్ లోని చెరువులు.. కుంటలు.. నాలాల్ని రక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఏర్పటు చేసిన సంస్థ హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ). తెలంగాణలో ఇప్పుడు ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా హైడ్రా గురించే మాట్లాడుకుంటున్నారు. రెండు నెలలుగా హైడ్రా ఆక్రమణలను తొలగిస్తోంది. ఇప్పటి వరకు 43 ఎకరాలకు పైగా భూమిని రికవరీ చేసింది. కానీ, ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చిన తర్వాతనే చాలా మందికి హైడ్రా అంటే తెలిసింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇమేజ్‌ను అమాంతం పెంచేలా చేసింది. ఇప్పటివరకు అధికారంలోకి ఎన్ని ప్రభుత్వాలు వచ్చినప్పటికీ.. వారెవరూ తీసుకోని సాహసోపేతమైన నిర్ణయాల్ని తీసుకుంటూ.. చర్యల్ని చేపట్టిన వైనం చూసినప్పుడు ఎవరో ఒకరు తెగించాలి.. మొత్తం సీన్‌ను మార్చేయాలన్న డైలాగ్ గుర్తుకు వస్తుంది. ఇప్పుడా బాధ్యతను రేవంత్ రెడ్డి తీసుకున్నారు. చెరువులు.. కుంటల భూముల్లో భారీ భవనాల్ని కట్టేసిన బడా బాబులకు షాకుల మీద షాకులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా పేరుతోపాటు.. ఎఫ్‌టీఎల్.. బఫర్ జోన్ అంటూ రెండు మాటలు పదే పదే వినిపిస్తున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటే ఏమిటో చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు. ఇంతకూ ఎఫ్ టీఎల్ అంటే ఏమిటి? బఫర్ జోన్ అంటే ఏమిటి? రూల్ పుస్తకంలో వీటి గురించి ఏముంది? ఈ పరిధిలో ఉండే పట్టా భూమి ఉన్నప్పుడు ఏం చేయాలి? దీనికి నిబంధనలు ఏం చెబుతున్నాయి? అన్న ప్రశ్నలకు సమాధానాల్ని వెతికితే.. సంపూర్ణమైన అవగాహనకు వచ్చే వీలుంది.ఫుల్ ట్యాంక్ లెవల్‌ను ఎఫ్‌టీఎల్‌గా పేర్కొంటారు. అంటే.. చెరువు కట్ట ప్రాంతం. మరింత వివరంగా చెప్పాలంటే.. ఒకర చెరువు నిండు కుండలా ఉన్నప్పుడు.. నీళ్లు ఎక్కడి వరకు వెళుతాయో.. ఆ మొత్తం ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్‌గా పేర్కొంటారు. మిగిలిన చోట్ల ఎలా ఉన్నా.. హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాల్లో చెరువులను ఆనుకొని నిర్మించిన విల్లాలు.. ఇళ్లు.. ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అలాంటి వారందరికీ ఇప్పుడు చుక్కలు కనిపించే పరిస్థితి. ఇలాంటి వాటి ఆస్తుల్ని కొనుగోలు చేసే ముందు.. నిర్మాణం ఎఫ్‌టీఎల్.. బఫర్ జోన్ పరిధిలో ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఆస్తుల్ని కొనకూడదు. ఎందుకుంటే.. ఏదో ఒక రోజు నెత్తి మీదకు తీసుకొచ్చేదే. ఈ మాటకు నిలువెత్తు నిదర్శనంగా సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్. దీని నిర్మాణం ఎఫ్‌టీఎల్.. బఫర్ జోన్.. మిగిలిన పట్టా ల్యాండ్‌లోనూ చేపట్టారు. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలు వారు.. ఎన్ కన్వెన్షన్ నిర్మాణాన్ని అక్రమం అన్న విషయాన్ని స్పష్టం చేశారు. దీంతో హైడ్రా ఎంట్రీ ఇచ్చేసి.. మొత్తం నిర్మాణాన్ని కూల్చేసింది. ఒకవేళ చెరువుకు సమీపంలో నిర్మాణాన్ని కడితూ నీటిపారుదల శాఖ నుంచి నోఅబ్జెక్షన్ పత్రం తీసుకోవాలి. అంతేకాదు.. సంబంధిత మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్.. జీహెచ్ఎంసీ నుంచి క్లియరెన్సు సర్టిఫికేట్ తీసుకోవాలి. ఈ మూడింటిలో ఏ ఒక్కటి లేకున్నా.. స్థలాన్ని స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది. ఈ సందర్భంలో నిర్మాణాన్ని నిర్మించిన వారు కోర్టును ఆశ్రయించినా పెద్దగా ఫలితం ఉండదు.ఒక బఫర్ జోన్ అంటే.. నీటి పరివాహక ప్రాంతంగా చెప్పాలి. మరో విధంగా చెప్పాలంటే.. రెండు లేదంటే అంతకంటే ఎక్కువ నీటి వనరులు ఉన్న ప్రాంతాల్ని వేరే చేసే ప్రదేశాన్ని బఫర్ జోన్ అంటారు. అక్కడ లభించే నీటి వనరు లభ్యత ఆధారంగా బఫర్ జోన్ పరిధిని డిసైడ్ చేస్తారు. ఇవి కూడా ప్రదేశాలను బట్టి.. చెరువులకు అనుగుణంగా బఫర్ జోన్ పరిధిని నిర్ణయిస్తుంటారు. చెరువుల నుంచి పల్లపు ప్రాంతాలకు నీరు పారటం సహజంగా చోటు చేసుకునేది. దీన్నే అలుగుగా వ్యవహరిస్తుంటారు. చెరువులకు.. పొలాలకు మధ్య ఉన్న ప్రాంతాన్ని బఫర్ జోన్ అంటారు. ఉస్మాన్ సాగర్ కింద ఉన్న భూములన్నీ బఫర్ జోన్ కిందకేవస్తాయి. ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాల్ని చేపట్టకూడదు. రూల్ బుక్‌లో పేర్కొన్న దాని ప్రకారం.. ఎఫ్‌టీఎల్ పరిధి నుంచి 30 మీటర్లు.. అంటే, వంద అడుగుల వరకు ఎలాంటి నిర్మాణాల్ని నిర్మించకూడదు. అయితే.. సదరు చెరువు 25 హెక్టార్లు అంతకు మించి విస్తీర్ణంలో ఉంటే 30 మీటర్ల మేరకు ఎలాంటి నిర్మాణం కట్టకూడదు. కావాలంటే.. బఫర్ జోన్ ప్రాంతంలో వ్యవసాయం చేసుకోవచ్చు.

# కనిమొళిలాగే బయిట పడతారా...?

చెన్నై: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎట్టకేలకు 165 రోజుల సుదీర్ఘ జైలు జీవితం తర్వాత సుప్రింకోర్టు బైయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో నిందితురాలిగా ఈడీ, సీబీఐ కేసులతో కవిత మార్చి 15వ తేదీన ఈడీ అదుపులోకి తీసుకుంది. ఏప్రిల్ 11వ తేదీన లిక్కర్ కేసులో కవిత అరెస్ట్ అయింది. ఇన్ని రోజుల పాటు జరిగిన న్యాయ విచారణ అనంతరం ఈడీ , సీబీఐ విచారణ పూర్తి అయినందున బైయిల్ మంజూరు చేస్తున్నట్లు సుప్రింకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కవిత దాదాపు165 రోజుల పాటు తీహార్ జైల్లో ఉన్నారు. అయితే దక్షిణ భారత దేశం నుండి మరో మహిళా రాజకీయ నాయకురాలు కూడా ఇలాగే తీహర్ జైల్లో 193 రోజులు ఉన్నారు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూమార్తెగా కవిత గుర్తింపు పొందారు. 1978లో జన్మించారు. 2006 లో ఉద్యమ రాజకీయాల్లో అరగేట్రం చేశారు. తెలంగాణ ఉద్యమ కార్యక్రమాల్లో కవిత కీలకంగా వ్యవహరించారు. నాటి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో కీలక నేతగా గుర్తింపు పొందారు. తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్, మరో కీలక నేత హరీశ్ రావు ఉన్నప్పటికీ పార్టీలో తనదైన శైలిలో మహిళా నేతగా గుర్తింపు పొందారు. ఎంపీ,ఎమ్మెల్సీ పదవులను చేపట్టారు. కవిత ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన నేతగా గుర్తింపు పొందారు. పార్లమెంట్ సమావేశాల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. పలు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీల్లో కవిత పని చేశారు. తెలంగాణ జాగృతి సంస్థకు అధినేతగా తెలంగాణ సంస్కృతికి సంబంధించిన కార్యక్రమలను చేపట్టారు. అయితే ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇరుక్కోవడంతో 165 రోజుల పాటు తీహార్ జైల్లో కవిత ఉన్నారు. తాజాగా సుప్రింకోర్టు బెయిల్ ఇవ్వడంతో జైలు నుండి కవిత బయటపడ్డారు.దక్షిణ భారత రాజకీయాల్లో కీలక మహిళా నేత కనిమొళి. 1968లో కరుణానిధికి జన్మించారు. ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కు సోదరి కనిమొళి. 2007లో తమిళ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. డీఎంకే పార్టీలో కీలక నేతగా గుర్తింపు పొందారు. తండ్రి కరుణానిధి, సోదరులు అళగిరి, స్టాలిన్ వంటి కీలక నేతలు నాడు ఉన్నప్పటికీ.. పార్టీలో తనకుంటూ ఓ ఇమేజ్ ను పెంచుకుంటూ వచ్చారు కనిమొళి. పార్టీలో కళలు, సాహిత్యం, హేతువాద సిద్ధాంతాల వ్యాప్తి వంటి తమిళ సాంస్కృతిక వ్యహారాల్లో కవిత లాగే కీలక పాత్ర పోషించారు. 2019లో లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. కవిత లాగానే పార్లమెంట్ స్టాండింగ్ కమిటీల్లో సభ్యురాలిగా చేశారు. పార్లమెంట్ లో కనిమొళి ఉపన్యాసాలకు మంచి పేరు వచ్చింది. కనిమొళి కూడా కవిత మాదిరే ఆనాడు దేశ వ్యాప్తంగా సంచలం సృష్టించిన 2జీ స్పెక్ట్రం కుంభకోణంలో అరెస్ట్ అయి 193 రోజులు ఢిల్లీలోని తిహార్ జైల్లో గడిపాల్సి వచ్చింది. కోర్టు బెయిల్ ఇవ్వడంతో కనిమొళి జైలు జీవితం నుండి బయపడ్డారు.ఆనాడు 193 రోజుల తర్వాత కనిమొళి తీహార్ జైలు నుండి విడుదల కాగా, డీఎంకే కీలక నేతలు, పార్టీ కార్యకర్తలు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఢిల్లీలోనే డీఎంకే కీలక నేతలు ఉండి చైన్నెకు ఆమెను తోడ్కొని వచ్చారు. చెన్నై ఏయిర్ పోర్టులో డీఎంకే అధినేత (దివంగత) కరుణా నిధి, సోదరుడు స్టాలిన్ సహా ముఖ్యనేతంతా ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ జెండాలతో, కనిమొళి, కరుణానిధి చిత్రాలతో కూడిన బ్యానర్లు, ఫ్లెక్సీలతో చైన్నై నగరం నిండిపోయింది. ఎక్కడ చూసినా పార్టీ కార్యకర్తల సందడి కనిపించింది. కవితకు బెయిల్ రావడంతో ఢిల్లీలోను, తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఇదే తరహా వాతావరణ నెలకొంది. ఇప్పటికే కవితను తోడ్కొని వచ్చేందుకు సోదరుడు కేటీఆర్, హరీశ్ రావు సహా పార్టీ కీలకనేతలంతా ఢిల్లీలో మకాం వేశారు హైదరాబాద్ కు తిరిగి రావడంతో కవితకు గ్రాండ్ వెల్ కమ్ ఇచ్చారు. చూస్తే దక్షిణాది నుండి కీలక మహిళా నేతలుగా ఎదిగిన ఇద్దరి రాజకీయ జీవతంలో సారూప్యత ఉందనడంలో ఏ సందేహం లేదు. అయితే 2జీ కుంభకోణంలో కనిమొళి నిర్దోషిగా బయపడ్డారు. మరి ఢిల్లీ లిక్కర్ కుంభకోణం నుంచి కవిత నిర్దోషిగా బయటపడతారా లేదా తెలియాలంటే కొంతకాలం వేచి చూడాల్సిందే.

# కాంగ్రెస్ లో నామినేటెడ్ చిచ్చు

నల్గొండ: ఉమ్మడి నల్లగొండ కాంగ్రెస్ పార్టీలో హేమా హేమిలైన జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి బ్రదర్స్, దామోదర్ రెడ్డిలు రాష్ట్ర కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఎవరికి వారే సొంత గ్రూపులతో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సీనియర్లైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రులుగా కొనసాగుతున్నారు. రాజకీయ ఉద్దండులు ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ లో ఓ పదవి చిచ్చు పెట్టింది.నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి రాష్ట్ర మంత్రి కావాలనే చిరకాల వాంఛ.. కలగానే మిగిలిపోయింది. తన కలను తనయుడు అమిత్ రెడ్డితో సాకారం చేసుకోవాలని గుత్తా ప్రయత్నించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి తనయుడి పొలిటికల్ ఎంట్రీకి గుత్తా సుఖేందర్ రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తనయుడు అమిత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసం గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి పార్లమెంట్ ఎన్నికలవేళ కాంగ్రెస్ కండువా కప్పించారు. సీఎం రేవంత్ తో గుత్తా సుఖేందర్ రెడ్డి కుటుంబానికి దగ్గరి బంధుత్వం ఉంది.బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డిలకు రేవంత్ సర్కార్ కీలక పదవులు కట్టబెట్టింది. పోచారంను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడిగా, గుత్తా అమిత్ రెడ్డిని రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ కుటుంబంతో ఉన్న బంధుత్వం వల్లే అమిత్ రెడ్డికి కార్పొరేషన్ పదవి వరించిందని పార్టీలో టాక్. అమిత్ రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవికి నామినేట్ చేయడం ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ లో కలకలం రేపుతోంది. ఉమ్మడి నల్గొండ నుంచి ఇప్పటికే పటేల్ రమేష్ రెడ్డి, బండ్రు శోభారాణి, నాగరి ప్రీతం, పాల్వాయి రజనీకుమారిలకు కార్పొరేషన్ పదవులు దక్కాయి.ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఇంకా చాలామంది ఆశావాహులు ఉన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కూడా కీలకమైన కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారట. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. తన అనుచరుడు గుమ్మల మోహన్ రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న శంకర్ నాయక్ కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. అద్దంకి దయాకర్, పున్న కైలాస్ నేత ఆశావాహులుగా ఉన్నారు. దీనికి తోడు కేబినెట్ బెర్త్ కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ కూడా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ లో చాలా కాలం నుంచి పనిచేస్తున్న సీనియర్లను కాదని గుత్తా అమిత్.. కీలక పదవి ఇవ్వడంపై ఉమ్మడి జిల్లా సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారట. పార్టీలో కొత్తగా వచ్చిన వారికే పదవులు కట్టబెడితే.. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నేతల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారట.

పోచారం శ్రీనివాస్ రెడ్డి, గుత్తా అమిత్ కు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వడంపై పార్టీ అధిష్టానం వద్ద ఓ సీనియర్ నేత తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారట. పార్టీలో కొత్తగా వచ్చిన వారికి పదవులు ఇస్తే పార్టీ క్యాడర్ కు తప్పుడు సంకేతాలు వెళ్తాయని నిరసన వ్యక్తం చేశారట.రాజకీయ భవిష్యత్తు కోసం తనయుడిని గులాబీ దళం నుంచి కాంగ్రెస్ గూటికి చేర్చినా.. గులాబీ పార్టీలో మాదిరిగానే ఇక్కడ కూడా తనయుడి రాజకీయ భవిష్యత్తుకు అడ్డంకులు తప్పడం లేదట. అయితే తాను ఒకటి తలచితే.. మరొకటి జరిగిందట. ఇప్పుడేం చేయాలో గుత్తా సుఖేందర్ రెడ్డికి పాలు పోవడం లేదట. ఈ నేపథ్యంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డిలకు రేవంత్ సర్కార్ కట్టబెట్టిన కీలక పదవులపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బ్రేక్ పడిందట.

# బీఆర్ఎస్ కు కర్ణాటక అస్త్రం

హైదరాబాద్: తెలంగాణలో సర్కార్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుంచి ప్రతిపక్షం బీఆర్ఎస్ పై పైచేయి సాధిస్తూ వస్తోంది. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షిస్తూ బీఆర్ఎస్‌పై మాటల దాడి చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ ఒప్పందాలపై విచారణ కమిషన్ నియమించి బీఆర్ఎస్ పెద్దలను టార్గెట్ చేసింది. అప్పుల అంశంతో మొదలుకొని ప్రతి విషయంలో గత ప్రభుత్వ చర్యలను తప్పుపడుతూ సీఎం రేవంత్ రెడ్డి చెడుగుడు ఆడుతున్నారు. తాజాగా హైడ్రా అంశాన్ని బేస్ చేసుకొని మరింతగా విమర్శల దాడి చేస్తోంది కాంగ్రెస్. సీఎం రేవంత్ అటాక్‌తో బీఆర్ఎస్ శిబిరం మొత్తం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అయితే అనుకోని వరంలా కర్ణాటకలో వాల్మీకి కుంభకోణం వెలుగుచూడటంతో బీఆర్ఎస్‌కు కొత్త అస్త్రం దొరికినట్లైంది. ఈ అస్త్రంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రివర్స్ అటాక్ మొదలుపెట్టింది గులాబీదళం.తెలంగాణలో అధికారంలోకి రాక ముందు.. ఇక్కడ పార్టీకి రోల్ మోడల్ కర్ణాటక కాంగ్రెస్ అంటూ విస్తృత ప్రచారం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడ పార్టీకి మంచి జోష్ వచ్చింది. ఇప్పుడు తాజాగా సేమ్ టు సేమ్ కర్ణాటక వ్యవహారం.. తెలంగాణ కాంగ్రెస్ మెడకు చుట్టుకుంటుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కర్ణాటకలో వాల్మీకి కుంభకోణం వెలుగులోకి రావడం ఆ పథకం లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణతో సిట్ దర్యాప్తు చేస్తోంది. దీంతో కర్ణాటక ప్రభుత్వం 12 మంది అధికారులపై వేటు వేసింది.సంబంధిత మంత్రి కూడా రాజీనామా చేశారు. ఇదంతా బాగానే ఉన్నా.. సిట్ దర్యాప్తులో హైదరాబాద్ లింక్ లు బయటపడటమే స్థానిక నేతలకు ఇబ్బందికరంగా మారింది. పలు ఐటీ కంపెనీలతోపాటు స్థానిక కాంగ్రెస్ నేతల కంపెనీలకు డబ్బులు మళ్లించినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో బీఆర్ఎస్ కర్ణాటక స్కాంను అందిపుచ్చుకుని ప్రభుత్వంపై అటాక్ చేస్తోంది. ఎన్నికల ముందు కర్ణాటక నుంచి తప్పుడు ధ్రువపత్రాలతో డబ్బును హైదరాబాద్ తరలించారని ఆరోపిస్తూ కాకపుట్టిస్తున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.వాల్మీకి స్కామ్ వ్యవహారం రోజురోజుకు ముదురుతుండటంతో అటు కర్ణాటక, ఇటు తెలంగాణ కాంగ్రెస్ నేతలకు కష్టాలు ఎక్కువవుతున్నాయంటున్నారు. ఈ వ్యవహారంలో ఈడీ రంగంలోకి దిగితే.. కొందరు ముఖ్య నేతలు అరెస్ట్ అయ్యే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది. ఈ పరిణామాలు మునుముందు కాంగ్రెస్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందనే చర్చ హీట్ పుట్టిస్తోంది. అధికారంలోకి రావడానికి ఉపయోగపడిన కర్ణాటక కాంగ్రెస్.. ఇప్పుడు అదే స్థాయిలో ఇబ్బందులకు గురి చేయడమే స్థానిక నేతలకు మింగుడు పడటం లేదని చెబుతున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి

## పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

## డబుల్ బెడ్ రూం లకు రూ.5 కోట్లతో మౌళిక సదుపాయాలు



పెద్దపల్లి: నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూం లకు రూ.5 కోట్లతో మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విజయరమణ రావు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రం సమీపంలో గల పెద్దపల్లి మండలం హనుమంతునిపేట (రాంపల్లి) రైల్వే గేటు, చందపల్లి వద్ద గల డబుల్ బెడ్ రూం లకు డి.ఎం.ఎఫ్.టీ ప్యాకేజీ 2 ద్వారా రూ. 3.45 కోట్ల రూపాయలతో మౌళిక సదుపాయాలయిన రోడ్లు, డ్రైనేజీ ల నిర్మాణం మరియు నీటి సరఫరా అలాగే విద్యుత్ సరఫరా కు ఆనందంగా దాదాపు మొత్తం కలిసి రూ. 5 కోట్ల నిధులతో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ , మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి తో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు నూతన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అరుణ శ్రీ, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, పెద్దపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, డబుల్ బెడ్ రూం లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోఅర్హులైన రైతులందరికీ రుణమాఫి

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతే రాజు అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పెద్దపల్లి మండలం రాగినేడులో అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సొసైటీ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 8 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి నిధులు కేటాయించిందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ చేశామని చెప్పారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసి తీరుతామని భరోసా ఇచ్చారు. సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని వాటిని రాష్ట్ర ప్రభుత్వం సరి చేస్తోందన్నారు. రైతులు ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు నమ్మొద్దని, ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం మేలు చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం సొసైటీ పాలకవర్గం, గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో విండో ఛైర్మన్ చింతపండు సంపత్, సిఈఓ తిరుపతి, డైరెక్టర్లు సోమ చంద్రయ్య, చింతపండు మల్లయ్య, యెల్లంకి స్వామి, తాడిషెట్టి సదయ్య, గండు వెంకన్న, కొత్త వెంకటమ్మ, లోకిని శారద, ఎడెల్లి శంకరయ్య, గుమ్మడి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# దూరవిద్య ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య

## డిగ్రీలో ప్రవేశానికి ఈ నెల 31వరకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి: దూరవిద్యా కేంద్రాల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు లెర్నర్ సపోర్ట్ సెంటర్ పెద్దపల్లి ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, కోఆర్డినేటర్ మొహమ్మద్ అబ్దుల్ షకూర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనవని అన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు ధరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఛాయిస్ బేస్ క్రెడిట్ సిస్టం ప్రకారం విద్యార్థులకు విద్య అందిస్తున్నామన్నారు. స్కిల్ సంబంధిత కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులకు జూమ్ యాప్, యూట్యూబ్ ద్వార తరగతులు నిర్వహిస్తున్నట్లు వివ్రించారు.పోటీ పరీక్షలకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయని, సదవకాశాన్ని పెద్దపల్లి పరిసర ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగులు, గృహిణులు, ప్రయివేటు ఉద్యోగులు, ప్రమోషన్ల అర్హత సాధించుటకు ప్రభుత్వ ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ట్యూషన్ ఫీజు చెల్లించుటకు ఈ నెల 31 చివరితేదీగా పేర్కొన్నారు.

# మేయర్ వర్సెస్ డిప్యూటీ మేయర్

కరీంనగర్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వై.సునీల్ రావు అమెరికా పర్యటన రాజకీయ దుమారం రేపింది. గడువులోగానే నగరానికి చేరేందుకు మేయర్ సిద్ధమవడంతో సమస్య టీ కప్పులో తుఫానులా మారిందని అందరూ భావించగా అనూహ్యంగా వివాదం ముదిరి బీఆర్ఎస్ పార్టీలో చిచ్చు రేపుతోంది. ఇంతకాలం చాప కింద నీరులా మేయర్, డిప్యూటీ మేయర్ మధ్యన కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధం ఒక్కసారిగా రచ్చకెక్కింది. కేవలం మేయర్ పర్యటన గురించే కాకుండా గడిచిన నాలుగున్నర ఏళ్ళ కాలంలో జరిగిన పరిణామాలన్నీ డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హరిశంకర్ దంపతులు ఏకరువు పెట్టడం రానున్న కాలంలో బీఆర్ఎస్ లో మరింత దుమారం చెలరేగక తప్పదనే సంకేతాలనిస్తోంది.ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కు సన్నిహితంగా ఉండే మేయర్, డిప్యూటీ మేయర్ మధ్యనే వివాదం చోటు చేసుకోవడంతో ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు ఇతర ముఖ్య నేతలెవరూ కూడా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.నెల రోజుల పర్యటన కోసం అమెరికా వెళ్ళిన మేయర్ సునీల్ రావు రాజకీయ విమర్శల నేపథ్యంలో 15 రోజుల్లోనే తిరుగు ప్రయాణం అవుతున్నారు. మేయర్ అమెరికా వెళ్ళే విషయాన్ని ముందుగా ఎవరికి చెప్పకపోవడంతో పాటు ఇన్ చార్జి బాధ్యతలు అప్పగించకపోవడాన్ని అవమానంగా భావించిన డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి హరిశంకర్ పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. అందుబాటులో లేని మేయర్ పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ నోటీసుతో స్పందించిన మేయర్ గడువులోగానే కరీంనగర్ లో అందుబాటులో ఉంటానని తేల్చి చెప్పారు. అయితే అనూహ్యంగా ఈ మొత్తం వ్యవహారం వెనుక జరిగిన తీరు పట్ల మనస్తాపానికి గురైన డిప్యూటీ మేయర్ స్వరూపారాణి నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్లా హరిశంకర్ మేయర్ సునీల్ రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. ఇకపై తగ్గేదే లేదని అల్టిమేటం ఇచ్చారు. పార్టీ నాయకత్వం, ఎమ్మెల్యే, మాజీ ఎంపీ అనుమతితోనే మీడియా ముందుకు వచ్చామంటూ స్పష్టత ఇచ్చిన చల్లా దంపతులు మేయర్ టార్గెట్ గా పలు విమర్శలు గుప్పించారు. కేవలం గంటల వ్యవధిలోనే అమెరికా నుంచి మేయర్ సునీల్ రావు దీనిపై స్పందించారు. డిప్యూటీ మేయర్, నగర పార్టీ అధ్యక్షుడి హోదాలో మీడియా ముందుకు వచ్చిన చల్లా దంపతులపై పలు విమర్శలు చేశారు. ఇరువురు ప్రజాప్రతినిధుల మధ్య సాగిన సవాళ్ళు?. ప్రతిసవాళ్ళ నేపథ్యంలో కరీంనగర్ మున్సిపల్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. దశాబ్దకాలం తర్వాత బీఆర్ఎస్ అధికారం కోల్పోయి గడ్డు పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఇద్దరు కీలక ప్రజాప్రతినిధులు రచ్చకెక్కిన వైనం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీ యాంశంగా మారింది. ఇరువురి మధ్య సమన్వయం కుదర్చాల్సిన స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కవితకు బెయిల్ లభించే అంశంపై ఢిల్లీలో ఉండిపోయిన నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు చిలికి చిలికి గాలివానలా ఎటు దారి తీస్తాయోనని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు.బిసి మహిళను కావడంతోనే మేయర్ తనపై వివక్షత చూపుతున్నాడని డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి ఆరోపించారు. ఒకే పార్టీకి చెందిన వాళ్ళమైనప్పటికి ఏ సమాచారం ఇవ్వకుండా ఒంటెద్దు పోకడతో మేయర్ వ్యవహరించారని విమర్శించారు. ఇన్ చార్జి బాధ్యతలు అప్పగించకుండా అమెరికా వెళ్ళాడని తెలిపారు. మేయర్ తీరుపై అనుమానాలున్నాయని.. గత 55 నెలలుగా మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన పనులపై దృష్టి సారించి మేయర్ బండారం బయటపెడుతామని స్పష్టం చేశారు.మేయర్ తీరుపై బిఆర్ఎస్ అదిష్టానంకు పిర్యాదు చేశామని బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ తెలిపారు. స్మార్ట్ సిటీ కి మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిదులు తీసుకువస్తే తాజా ఎంపీ బండి సంజయ్ ని మేయర్ పొగిడారని గుర్తు చేశారు. పార్టీ మారే ఉద్దేశంతోనే స్వపక్షానికి చెందిన డిప్యూటీ మేయర్ తోపాటు కార్పోరేటర్ లను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

మేయర్ తీరుపై బిఆర్ఎస్ అదిష్టానం దృష్టి పెట్టిందన్నారు. త్వరలోనే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.మూడు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల వెనుక పరుగెత్తలేదని.. ప్రజల మధ్యన ఉండి పని చేశానని మేయర్ సునీల్ రావు స్పష్టం చేశారు. అమెరికా నుంచి ఒక వీడియో ప్రకటన చేస్తూ చల్లా హరిశంకర్ దంపతులపై విరుచుకుపడ్డారు. చల్లా దంపతుల్లాగా వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడలేదని తేల్చిచెప్పారు. కేవలం పదవీకాంక్ష కోసం డిప్యూటీ మేయర్ పదవిని అడ్డం పెట్టుకొని దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న చల్లా దంపతులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ ను కోరుతున్నానని తెలిపారు.

## నిద్రిస్తున్న విద్యార్థులపై ఎలుకల దాడి

### 13 మందికి గాయలు

### భీమనపల్లి గురుకలంలో ఘటన

నల్గోండ: దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామ శివారులోని బీసీ బాలుర గురుకుల పాఠ శాల లోనిద్రిస్తున్న విద్యార్థులపై ఎలుకలు దాడి చేశాయి. దీంతో 13 మంది గాయపడ్డారు. సోమవారం రాత్రి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. స్థానికులు సమాచారంతో ఈ విషయం బయట పడింది. ఘటనలో విద్యార్థులు పి గౌతమ్ , ఏ శివ సాయి, పి మల్లికా ర్జున్, జి సంజయ్, జి శ్రీనిధి, జి సిద్దు, ఏం శివ, వి అభిషేక్, ఆర్ విగ్నేష్, పి. వంశీ, ఏం నిఖిల్, ఎం భరత్ లకు గాయాలయ్యాయి. బీసీ గురుకుల పాఠశాల అపరిశుభ్రంగా ఉండడం వల్లే ఎలుకలు ఎక్కువగా చేరుతు న్నాయని విద్యార్థులు తెలిపారు. విషయాన్ని విద్యార్థులు అధ్యాపకుల దృష్టికి తీసుకు వెళ్లడంతో పాఠశాల హెల్త్ సూపర్ వైజర్ 13 మంది విద్యార్థులను తూర్పు పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అంద జేశారు.

## మీర్ పేటలో హైడ్రా రంగనాధ్ పర్యటన



హైదరాబాద్: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం మీర్ పేటలో పర్యటించారు. మీర్ పెట్ మున్సిపల్ కార్పోరేషన్ లో కబ్జాకు గురైన మూడు చెరువులను స్థానికులు, అధికారులతో పరిశీలించారు. కబ్జాలకు పాల్పడి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసిన తరువాత కూల్చివేతలు ఉంటాయి అని అధికారులు తెలిపారు. ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలను పరిశీలించారు చెరువుల్లో ఫంక్షన్ హాల్ షాపింగ్ కాంప్లెక్స్ లను పరిశీలించారు. మీర్పేట్ లో మూడు చెరువులు సంధ చెరువు మంత్రాల చెరువు పెద్ద చెరువు ఈ మూడు యొక్క గొలుసుకట్టు చెరువు లను పూర్తిగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అధికారులను పూర్తిగా చెరువుల యొక్క ఆక్రమాలపై నివేదిక తయారు చేయాలని తెలిపారు. బాలాపూర్ ఎమ్మార్వో, ఆర్ ఐలను పూర్తి వివరాలు అడిగారు. గతంలో కబ్జాలో ఉన్నవారికి ఎవరికైనా నోటీసులు ఇచ్చారు అని ఆరా తీశారు. గతంలో కబ్జా చేసిన వాటిని ఎంతవరకు డీమాలేషన్ చేశారని వాటిపైన పూర్తిగా నివేదిక తయారు చేయాలని బాలాపూర్ ఎమ్మార్వోకు ఆదేశించారు.

# కవిత బెయిల్... మూడు పార్టీల దాడులు.. ఎదురుదాడులు

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పై రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు పరస్పరం రాజకీయ విమర్శలు ఎక్కుపెట్టాయి. కవిత బెయిల్ రావడం వెనుక కారణం బీజేపీయే అని రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు విమర్శిస్తుంటే, బెయిల్ రావడానికి కాంగ్రెస్ సాయం చేసిందని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదురుదాడికి దిగుతోంది. గత ఎన్నికల ముందు నుండి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బీజేపీ- బీఆర్ఎస్ ల మధ్య లోపాయకారీ ఒప్పందాలున్నాయని ప్రచారం చేస్తూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఐటీ, ఈడీ దాడులు బీజేపీ, బీఆర్ఎస్ లు సంయుక్తంగా చేయించిన దాడులుగా కాంగ్రెస్ అభివర్ణించింది. బీఆర్ఎస్ కు మళ్లీ అధికారం కట్టబెట్టేందుకే బండి సంజయ్ ను అధ్యక్ష పదవి నుండి బీజేపీ అధినాయకత్వం తప్పించిందని ప్రచారం చేసింది. బీజేపీతో బంధం ఉన్నందుకే కవిత అరెస్ట్ కావడం లేదన్న ప్రచారం పెద్ద ఎత్తున చేపట్టింది. అయితే ఆ తర్వాత బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగింది. ఈ తరుణంలో కూడా కవిత అరెస్ట్ కాకపోవడానికి బీజేపీతో ఉన్న బంధమే కారణమన్న విమర్శలు కాంగ్రెస్ నేతలు గుప్పించారు. మార్చి నెలలో కవితను లిక్కర్ కేసులో అరెస్ట్ చేయడం జరిగింది. ఆ తర్వాతి పరిణామాలు తెలిసిందే. గత కొద్ది రోజుల నుండి మాత్రం త్వరలోనే కవితకు బెయిల్ వస్తుందని ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకోవడానికే కేటీఆర్, హరీశ్ రావులు ఢిల్లీలో మకాం వేశారని హస్తం నేతలు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. త్వరలో బీఆర్ఎస్ బీజేపీలో విలీనం కానుందని ప్రచారం మొదలు పెట్టారు. దీన్ని ఇరువురు గులాబీ నేతలు ఖండించాల్సి వచ్చింది. కాంగ్రెస్ నేతలు చెప్పినట్లే బెయిల్ రావడంతో బీజేపీతో ఒప్పందం కుదరడంతోనే కవితకు బెయిల్ వచ్చిందని తాజాగా కాంగ్రెస్ ప్రచారం మొదలు పెట్టింది. 16 నెలలు జైల్లో ఉన్న మనీష్ సిసోడియాకు, ఇంకా జైల్లో ఉన్న కేజ్రీవాల్ కు రాని బెయిల్ కవితకు ఎలా వచ్చిందని సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి తన ప్రశ్నల ద్వారా బీజేపీతో మైత్రి కుదిరిందన్న వార్తలు వాస్తవం అన్న రీతిలో అనుమానాలు రేకెత్తించేలా వ్యాఖ్యానించడం గమనార్హం. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ సీట్లు పెరగడానికి బీఆర్ఎస్ త్యాగం చేసినందుకే కవిత బయటకు వచ్చిందని కవిత బెయిల్ వెనుక ఉన్న మతలబు ఇదేనంటూ రేవంత్ రెడ్డి సూత్రీకరించారు.కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న విమర్శలను బీజేపీ సైతం దీటుగా సమాధానం ఇస్తోంది. లిక్కర్ కేసులో సుధీర్ఘ కాలం జైల్లో కవితను పెట్టింది మేం అయితే ఆమెకు బెయిల్ ఇప్పించింది కాంగ్రెస్ న్యాయవాదుల బృందమే అని కమలం నేతలు ఎదురుదాడికి దిగారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అయితే కవితకు బెయిల్ రావడం బీఆర్ఎస్ - కాంగ్రెస్ ల సంయుక్త విజయంగా అభివర్ణించారు. కవిత కేసు ను వాదించిన అడ్వకేట్ ను రాజ్యసభకు



పంపడం అనే ఒప్పంద వల్లే కవితకు బెయిల్ సాకారమ యిందని ఆరోపణ చేశారు. ఇలా కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పై పరస్పర రాజకీయ యుద్ధానికి దిగడం తెలంగాణలో పొలిటికల్ హీట్ పెంచింది.తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కీలక రాజకీయపార్టీలుగా ఉన్నవి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు. అయితే ఎన్నికల ముందు బీఆర్ఎస్ ను దెబ్బకొట్టే రీతిలో రెండు పార్టీలు పని చేశాయి. సైద్ధాంతికంగా కలవకపోయినా ఒకే లక్ష్యంతో పని చేశాయి. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్‌లు బీఆర్ఎస్ భుజం మీద తుపాకి పెట్టి ఒకరినొకరు దెబ్బకొట్టే రాజకీయాలు చేస్తున్నాయి. ఇందుకు కవిత బెయిల్ అంశాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని రాజకీయ లబ్ధి పొందే రీతిలో వ్యూహాలు అమలు చేస్తున్నాయి. రాజకీయాల్లో ఓట్లు,సీట్లే ఆ పార్టీ బలాబలాలను నిర్దేశిస్తాయి కాబట్టి అయితే ఈ వ్యూహాత్మక పోరాటంలో ఏ పార్టీకి రాజకీయ లబ్ధి చేకూరుతుందో తెలియాలంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే. కవిత బెయిల్ విషయంలో రెండు పార్టీలు పరస్పర రాజకీయ విమర్శలు చేసుకుంటున్నా... మధ్యలో బీఆర్ఎస్ ను రాజకీయంగా డామేజ్ చేసే విషయంలో మాత్రం రెండు పార్టీలు కలిసి పని చేస్తున్నాయనే చెప్పాలి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ బీఆర్ఎస్ తిరిగి పుంజుకోకుండా ఉండేలా వ్యూహాత్మకంగా దెబ్బ తీసేందుకు బీజేపీతో మైత్రీ ఉందని విమర్శలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇది ఎంత వరకు నిజమో కాలమే సమాధానం చెబుతుంది. ఈ ప్రచారం ద్వారా బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ, బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకు బీఆర్ఎస్ నుండి బయటకు వచ్చి తమతో కలిసేలా చేయాలన్న ఆలోచన ఈ ప్రచారం వెనుక దాగి ఉందనడంలో సందేహం లేదు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉనికి లేకుండా చేస్తే ఆ పార్టీ మరింత బలహీనపడి కనుమరుగు అవుతుందన్నఆలోచనలో హస్తం నేతలు ఉన్నారు. ఐదేళ్ల పాటు అధికారంలో లేకుండా పార్టీని నడపడం సాధ్యం కాని పని అని ఈ విషయంలో కేసీఆర్ ను దెబ్బకొడితే ఆ పార్టీ పునాదులు కదులుతాయన్న వ్యూహంతో రేవంత్ రెడ్డి ఈ తరహా ప్రచారంతో సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక బీజేపీ వైపు నుంచి చూస్తే ఎప్పటి నుండో దక్షిణాదిన పార్టీని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఉన్న కమలం నేతలకు తెలంగాణలో ఇప్పుడు ఉన్న రాజకీయ వాతావరణం మంచి అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు బీజేపీలో మరింత ఆశలు రేపాయనడంలో సందేహం లేదు. బీఆర్ఎస్ కు మద్ధతిచ్చే వర్గాలను తమ వైపు తిప్పుకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్ లను దెబ్బకొట్టేందుకు, ఆ తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పీఠం ఎక్కేందుకు మార్గం సుగమం అవుతుందన్న యోచనలో బీజేపీ వర్గాలు ఉన్నాయి. ఈ కారణంతో బీఆర్ఎస్ ను ఎంత బలహీనం చేస్తే ఆ స్థానంలో కమలం పార్టీ తో భర్తీ చేద్దామన్న వ్యూహం వారిది.అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీల వ్యూహాలు తెలిసినా.పదేళ్ల పాటు ఒంటి చేత్తో తెలంగాణ రాజకీయాలను శాసించిన బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కు మౌనంగా ఉండటం తప్ప ఇప్పటికిప్పుడు చేసేదేం లేని పరిస్థితి నెలకొంది.తన కుమార్తె కవితకు బెయిల్ రావడం వ్యక్తిగతంగాను, రాజకీయం గాను కేసీఆర్ కు కొంత ఊరటనిచ్చే విషయం. పార్టీ పరంగా చూస్తే వచ్చే ఎన్నికల నాటి వరకు తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోవడం తన ముందు ఉన్న పెద్ద టాస్క్. ప్రస్తుతం తనతో పాటు ఉన్న ఎమ్మెల్యేలను కాపాడుకోవడా నికి కేసీఆర్ ఏం చేస్తారన్నది వేచి చూడాలి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై టెక్నికల్ గా అనర్హత వేటు పడేలా న్యాయస్థానాల ద్వారా విజయం సాధిస్తారా లేదా అన్నది చూడాలి. ఇక మరో పెద్ద టాస్క్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు. ఇందు కోసం కేసీఆర్ ఏం చేస్తారు అన్నది మరో ప్రశ్న. పార్టీ పటిష్టతకు, పార్టీ కమిటీల నిర్మాణం, పార్టీ బాధ్యతల పంపిణీ వంటి అంశాలు ప్రాధాన్యమైనవే. ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పార్టీని అంటిపెట్టుకునేలా వారికి ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారో అన్నది కూడా కేసీఆర్ ముందున్న సమస్యలే. వచ్చే ఎన్నికల నాటికి పార్టీ బలోపేతం అయ్యేలా ఎలాంటి రోడ్ మ్యాప్ తయారు చేస్తారు.అటు బీజేపీ- ఇటు కాంగ్రెస్ పార్టీల వ్యూహాలను ఎదుర్కొని రాష్ట్రంలో మరో దఫా చక్రం తిప్పుతారా లేదా అన్నది కూడా బీఆర్ఎస్ చీఫ్ ముందున్న ప్రశ్నలే. అన్ని చక్కగా కుదిరినప్పుడు ఏ సమస్య అయినా సులువుగానే పరిష్కారం అవుతుంది. రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా లేనప్పుడే పార్టీ అధినాయకుడు ఆ వాతవరణం తమకు ఏలా అనుకూలంగా మార్చుకుంటారు అన్నదే.. నాయకుడి సంబంధించిన నాయకత్వ లక్షణాలను బయపెడుతోంది. ఉద్యమ రాజకీయాలతో పాటు, అధికార పీఠంలో పదేళ్లు ఉన్న కేసీఆర్ కు ఇవేమి తెలియనవి కావు. ఇక రానున్న రోజుల్లో ఎలాంటి నిర్ణయాలతో కేసీఆర్ ముందుకు సాగుతారో చూడాల్సిందే.

## షాద్ నగర్ ఎలికట్ట చౌరస్తా వద్ద ప్రమాదం

### ఆగి ఉన్న కంటైనర్ ను ఢీ కొట్టిన బైక్

### అక్కడికక్కడే మృతి చెందిన వాహనదారుడు

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం ఎలికట్ట చౌరస్తా వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం ఆగి ఉన్న కంటైనర్ ను బైక్ ఢీ కొట్టినట్టగా, కంటైనర్ డ్రైవర్ పరారిఅయినట్టు తెలిపారు. ఆక్సిడెంట్ అయిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ పై ఉన్న మహిళకు కాలు విరిగినట్టుగా సమాచారం అక్కడ వున్న కొందరు వ్యక్తులు 100 కు డయల్ చేయగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కుమ్మరి మహేష్ మిఠాలాపూర్, చౌడాపూర్, కుల్కచర్ల వికారాబాద్ జిల్లా వాసిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్ సుశిల,కానిస్టేబుల్లు భూపాల్ రెడ్డి, జమీర్ లు ఘటన స్థలానికి చేరుకొని యాక్సిడెంట్ ఏ విదంగా అయిందో సమాచారం సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# సానుభూతి లెక్క వర్కౌట్ అయినట్టేనా!

హైదరాబాద్: రాజకీయ చాణక్యుడు కేసీఆర్. ఆయన ప్రతి అడుగులోనూ రాజకీయం ఉంటుంది. పబ్లిక్ లైఫ్ లోకి వచ్చిన తర్వాత కుటుంబ వ్యవహారాలు కూడా రాజకీయాలతో ముడిపడి ఉంటాయి. ఈ విషయం ఆయనకు బాగా తెలుసు. అందుకే కవిత కేసు, ఆమె అరెస్టు విషయంలో చాలా లో ప్రొఫైల్ పాటించారు కేసీఆర్. ఇప్పుడు కవిత అరెస్టు వరకూ గుంభనంగా ఉన్నారు. కనీసం ఒక్క సారి అంటే ఒక్క సారి కూడా ఆమెను పరామర్శించేందుకు ఢిల్లీ వెళ్లలేదు. అంతే కాదు.. ఆ కేసు గురించి ఎక్కడా పెద్దగా మాట్లాడలేదు కూడా. వీలైనంత వరకూ తన కుమార్తె జైల్లో ఉందన్న సంగతి తనకు తెలియన్నట్లుగా వ్యవహరించారు. ఒకటి రెండు సందర్భాల్లో పార్టీ అంతర్గత సమావేశల్లో మాత్రం తాను రగిలుతున్న అగ్నిపర్వతంలా ఉన్నానని చెప్పారు. నిజంగా ఆయన అలాగే ఉంటారని..కానీ ఆవేశ పడకుండా.. రాజకీయ వ్యూహాలు పన్నుతున్నారని అంటున్నారు. కవితపై లిక్కర్ కేసు ఖచ్చితంగా రాజకీయ ప్రేరేపితమని ప్రజల్లోకి వెళ్లేలా చేసేందుకు కేసీఆర్ పక్కా వ్యూహంతోనే కుమార్తె విషయంలో అంటీ ముట్టనట్లుగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కవిత ఎపిసోడ్ మొత్తం కేసీఆర్ సైలంట్ గా ఉండటానికి కారణం తన సమయం వచ్చే వరకు వేచి చూసే ధోరణి అవలంభించడమేనని అంటున్నారు. మీడియా అంతా కవితపై నెగిటీవ్ మాట్లాడుతున్నా... కేసీఆర్ ఒక్క మాట ఏం మాట్లాడలేదు. ఏం మాట్లాడినా అది ఆ కేసు విషయంలో మరింత విస్తృతమైన చర్చకు కారణం అవుతుంది. ఓ మీడియా సమావేశంలోనే కడిగిన ముత్యంలా తన కూతురు వస్తుందని కామెంట్ చేశారు. ఆ తర్వాత కవిత కేసు విషయంలో ఎక్కడా మాట్లాడలేదు. ఐదున్నర నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. కానీ ఒక్క సారి కూడా పరామర్శిం చలేదు. తను వెళ్లడం వల్ల జాతీయ స్థాయిలో మీడియా నెగిటీవ్ గా ప్రొజెక్ట్ చేస్తుందని...ఈ కేసుకు ప్రాధాన్యత పెరుగుతుం దన్న కారణంగా ఆగిపోయి ఉంటారని అంచనా వేస్తున్నారు. బీజేపీతో కలవడానికే కేసీఆర్ ఢిల్లీ వెళ్లారన్న ప్రచారం జరిగే ప్రమాదం ఉందని.. ఇలాంటి వాటికి అవకాశం ఇవ్వకుండా కేసీఆర్ వ్యూహాత్మకంగా ఢిల్లీ వెళ్లలేదని చెబుతున్నారు. లకేటీఆర్ మాత్రమే కాకుండా హరీశ్ రావును అక్కడి పంపి కేటీఆర్ కూడా బీజేపీతో చర్చలు అన్న ప్రచారం జరగకుండా హరీశ్ రావును తోడుగా పంపారని భావిస్తున్నారు. కవిత విడుదల తర్వాత అంతా కవిత మీద ఉన్న నెగిటీవ్ ప్రచారం వెనక్కు పోయేలా డిజైన్ చేశారు. నిన్న విడుదల అంతా మీడియాలో వచ్చేలా చూశారని ఇదంతా కేసీఆర్ వ్యూహమేనని అంటున్నారు. హైదరాబాద్ ఎయిర్ పోర్టు నుంచి బయటకు రాగానే కవిత జై తెలంగాణ నినాదాలు చేశారు. ఇది కూడా రాజకీయ కేసులో బయటకు వచ్చారన్న అభిప్రాయాన్ని కల్పించడానికేనని భావిస్తున్నారు.తన కూతురు ఇమేజ్ పెరిగేలా ఎయిర్ పోర్టు నుండి భారీగా స్వాగత సత్కారాలను కేసీఆర్ ఏర్పాటు చేశారు. కవిత రాజకీయ భవిష్యత్తుకు ఉపయోగపడేలా బెయిల్ నుండి వచ్చిన కవిత కవరేజి మీడియాలో వచ్చేలా పక్కా ప్లానింగ్ తో వ్యవహరించారు. సాయింత్రం ఇంటి వద్ద కవితను కలవకుండా జాగ్రత్తలు. తాను వస్తే మీడియా అంతా కవితను వదిలి.. తనపో ఫోకస్ చేస్తారని కేసీఆర్ కు తెలుసు. అందుకే రాకుండా ఉన్నారు. ఫాం హౌస్ లో కలవడం మరో రోజు మీడియాలో ప్రముఖ వార్త అవుతుందని కవిత తప్ప ఎక్కడా ఈ విషయంలో కేటీఆర్, హరీశ్ రావు లు మాట్లాడకుండా జాగ్రత్తలు తీసు కోవడం వ్యూహంలో భాగమే. తాను మాట్లాడకుండా కవిత తోనే మాట్లాడించడం ఇమేజ్ ను క్రియేట్ చేయడంలో భాగమని అంటున్నారు. మొత్తగా కేసీఆర్ కవిత జైలు జీవితం పునాదులుగా మంచి రాజకీయ జీవితాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు వేసినట్లుగా అర్థం చేసుకోవచ్చంటున్నారు.

# హైడ్రాకు ఫుల్ డిమాండ్

హైదరాబాద్: హైడ్రా.. ఎక్కడ చూసినా ఈ పేరు మార్మోగుతోంది. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల రక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలు అక్రమార్కులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. స్వపక్షం, విపక్షం అనే తేడా లేకుండా బుల్డోజర్లతో దూసుకెళ్తోంది. చెరువుల పక్కనే ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తోంది. వరుస కూల్చివేతలు జరుగుతుండటంతో కబ్జాలకు గురైన చెరువులు, నాలాలు, పార్కులపై రోజూ హైడ్రాకు కనీసం 60 నుంచి 70 వరకు ఫిర్యాదులు అందుతున్నాయి. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్న హైడ్రా, ఆక్రమణలను బట్టి చర్యలకు సిద్ధమవుతోంది.అక్రమ కట్టడాలపై వరుస ఫిర్యాదుల నేపథ్యంలో త్వరలోనే హైడ్రా చట్టం తీసుకొస్తామని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా పోలీస్ స్టేషన్స్ ఏర్పాటు చేసిన తర్వాత ప్రజలు నేరుగా అక్కడికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై హైడ్రా పోలీస్ స్టేషన్ చర్యలు తీసుకుంటుందని, ఇప్పటివరకు జరిగిన విచారణలో కొంతమంది అవినీతి అధికారులను గుర్తించినట్టు చెప్పారు. వారిపై త్వరలోనే కేసులు నమోదు చేసి విచారణ చేస్తామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న చెరువులను కాపాడడమే లక్ష్యంగా పెట్టుకుంది హైడ్రా.చెరువులు, కుంటల వద్ద కూల్చివేతలకు కొన్నిచోట్ల ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం సహకరించినా, పరిస్థితులు అనుకూలించడం లేదు. ఆక్రమణలలో పాఠశాలలు, కళాశాలలు వెలిశాయి. వాటి కూల్చివేతలపై వేచి చూడాలని హైడ్రా భావిస్తోంది. అకడమిక్ ఇయర్ మొదలు కావడం ఇప్పటికే ఆ బిల్డింగుల్లో చదువుతున్న వందల మంది స్టూడెంట్స్‌కి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో నోటీసులు జారీ చేసి కొంత సమయం ఇవ్వాలని చూస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.మల్లారెడ్డి అల్లుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి బిగ్ షాక్ తగిలింది. ఆయనకు చెందిన కళాశాలకు మరోసారి నోటీసులు జారీ చేశారు రెవెన్యూ అధికారులు. ఆయనకు చెందిన దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ, ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కాలేజీలకు నోటీసులు పంపించారు. చిన్నదామర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని సర్వే నంబర్ 489లో ఒక ఎకరాలో కళాశాల భవనాలు నిర్మించారు. 485, 488, 484 సర్వేలలో రెండు ఎకరాల్లోని షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. 492 ,489 లలో మూడు ఎకరాల్లో పార్కింగ్‌కి స్థలాలు కేటాయించారు. కాలేజీ రోడ్స్‌కి 2.24 ఎకరాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు అధికారులు.హైడ్రా మాదిరి నిజామాబాద్‌కి నిడ్రా కావాలని అడుగుతున్నారు అక్కడి స్థానికులు. నగర వ్యాప్తంగా ఈ మాట బలంగా వినిపిస్తోంది. కబ్జా కోరల్లో చిక్కుకున్న రామ్మూర్తి చెరువును సందర్శించిన అర్సపల్లి గ్రామ కమిటీ ప్రతినిధులు, హైడ్రా తరహాలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలంటూ ధర్నా చేశారు. కబ్జాల నుంచి చెరువును కాపాడాలంటూ నినాదాలు చేశారు. రామ్మూర్తి చెరువు విస్తీర్ణం 30 ఎకరాలు. ప్రస్తుతం మిగిలింది 12 ఎకరాలు మాత్రమే. బోధన్ రోడ్డును ఆనుకుని ఉన్న చెరువు కట్ట బఫర్ జోన్ స్థలంలో ఆక్రమణలు వెలిశాయి. దిగువన 7 ఎకరాల్లో ఉన్న గాడి కుంట చెరువు కూడా కబ్జా అయింది. చెరువుల అక్రమణలు తొలగించాలంటూ త్వరలోనే చలో కలెక్టరేట్ చేపడతామని అర్సపల్లి గ్రామ కమిటీ తెలిపింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినీ కలుస్తామని స్పష్టం చేసింది.

# రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వాహనదారులపై స్పెషల్ డ్రైవ్

సిద్దిపేట: రాంగ్ సైడ్ డ్రైవింగ్ మీకు ప్రమాదకరం మరియు మీ ఎదురుగా వచ్చే వారికి మరింత ప్రమాదకరం రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వారిపై ఎం వి యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తాం
రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. ఒక రోడ్డు ప్రమాదంతో జీవితాన్నే మార్చేస్తుంది
మరణం లేని కారణం ఒక్క రోడ్డు ప్రమాదం మాత్రమే
రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం సిద్దిపేట పట్టణంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే 21 వాహనాలను సీజ్ చేయడం జరిగింది. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడంవల్ల చేసే వ్యక్తికి ప్రమాదం మరియు ఎదురుగా వచ్చే వ్యక్తి కూడా చాలా ప్రమాదమని రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వారిపై కఠినంగా వివరిస్తామని హెచ్చరించారు ముందుకు వెళ్లి డివైడర్ వద్ద మలుపుకొని సరియైన మార్గంలో వెళితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసిన వాహన యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించి చట్ట ప్రకారం జరిమానా విధిస్తామని తెలిపారు. మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనదారులు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడుపుతునందున్న ప్రమాదం జరిగే అవకాశం ఉందని, నెంబర్ ప్లేట్ నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మోటార్ సైకిల్ పై ముగ్గురు ప్రయాణించ వద్దని, వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వెంబడి ఉంచుకోవాలని ట్రిబుల్ రైడింగ్, మరియు రాష్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. మరియు మోటార్ సైకిల్ వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని, హెల్మెట్ మా శాసనం కాదు మీ సంక్షేమం, హెల్మెట్ ఒక వస్తువు కాదు ప్రాణాన్ని కాపాడే ఆయుధం, రోడ్ చిన్నదైనా పెద్దదైన, పడితే ప్రమాదమే ఆదమరిస్తే విషాదమైన ఎక్కడైనా ఎప్పుడైనా చిన్నవారైన పెద్దవారైనా ప్రమాదం పొంచి ఉన్నదని ఎవరికెరుక అందుకే ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రజలందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. నెంబర్ సరిగ్గా లేని వాహనాల పై కొంతమంది నేరస్తులు బండ్లపైన వచ్చి దొంగతనాలు చేయడం, మరియు చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ఏ ఎస్ఐలు ఉమేష్, సదాశివరావు మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన ఆఫ్ క్యాంపస్ ప్లేస్మెంట్ జెన్ ప్యాక్ డ్రైవ్




పెద్దపల్లి: ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ఆఫ్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ లో హెచ్ ఆర్ ఫైనల్ రౌండ్ కి అర్హత పొందిన 21 విద్యార్థులకు నియామక పత్రాలు ట్రినిటీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఉద్యోగ ప్రక్రియ బహుళ జాతీయ కంపెనీ జెన్ ప్యాక్ ద్వారా ఆఫ్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ లో 21 మంది విద్యార్థులకు పైగా ఉద్యోగాలు పొందారు. ఈ యొక్క ప్రక్రియలో బహుళ జాతీయ కంపెనీలు జెన్పాక్ట్, కంపెనీ పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది, ఉద్యోగం పొందిన విద్యార్థులకు ట్రినిటీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వారి చేతుల మీదుగా ఆ కంపెనీ అర్హత పత్రాలు ఉద్యోగం పొందిన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ కళాశాలపై నమ్మకం ఉంచి తమ యొక్క పిల్లలని నమ్మకంతో ఇంజనీరింగ్ చేర్పించి నందుకు వారికి బహుమతిగా బీటెక్, ఎంబీఏ ఉత్తరులైన 2021, 22 ఌ 2023, 24 అకడమిక్ విద్యార్థులు ప్రతి ఒక్క విద్యార్థికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఒక దృఢ సంకల్పంతో ఈ యొక్క మెగా ఆన్ క్యాంపస్ రిక్రూట్మెంట్ నిర్వహించామని, ప్రతి విద్యార్థి ఉద్యోగ అవకాశం పొందే విధంగా తమ యొక్క కళాశాల ఆధ్వర్యంలో టాస్క్ బృందం చర్యలు తీసుకుంటుందని ఉద్యోగాలు పొందిన విద్యార్థులను నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ప్రతి ఒక విద్యార్థి ఉద్యోగంలో చేరి ఎక్స్పీరియన్స్ పొంది ఉన్నతమైన కంపెనీలకు ఉద్యోగ అవకాశాలు పొందడం కొరకు ఈ యొక్క ఉద్యోగం పునాదిగా నిలుస్తుందని దీనిని ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉద్యోగంలో చేరాలని తద్వారా తమ యొక్క కళాశాలకు మరియు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు పొందడానికి ఆవశ్యకత ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెన్పాక్ట్ సౌత్ ఇండియా మేనేజర్ టాస్కర్ రీజినల్ కోఆర్డినేటర్ గంగా ప్రసాద్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్. అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం గణేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఆరిఫ్, హెచ్ ఓ డి లు డాక్టర్ నటరాజన్, రాజిరెడ్డి,స్వాతి, ప్రభాకర్, రామ్మోహన్, టాస్క్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ కౌశల్య, మధు, శేఖర్, శ్రీలత, సాయి, సన, రిక్రూట్మెంట్ రిప్రజెంటేటివ్ లు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలలో రాణించాలి

**-మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంట్రి రమా సురేష్ రెడ్డి**

**స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం**



మంథని: చదువుతో పాటు క్రీడలలో ఆసక్తి కనబరిచి రాణించాలని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంట్రి రమా సురేష్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి క్రీడా పోటీలను మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంట్రి రమా సురేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడా పోటీలు ప్రారంభించి కాసేపు పిల్లలతో తో కలిసి కబడ్డీ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రమా సురేష్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల శరీరానికి కావలసిన వ్యాయామం, ఆరోగ్యం, దృఢంగా ఏర్పడుతాయని వివరించారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు క్రీడలపట్ల ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారని ఎలాంటి వసతులు కావాలన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల విద్యాధికారి దాసరి లక్ష్మీ అధ్యక్షతన ఎస్జిఎఫ్ జిల్లా సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్,ఎస్జిఎఫ్ జోనల్ సెక్రటరీ అవదాని మాధురి ఆధ్వర్యంలో ఎస్జిఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలో నాలుగు మండలాలు మంథని, ముత్తారం రామగిరి కమాన్పూర్ నుండి జిల్లా పరిషత్ మండల పరిషత్ కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాలు, మైనారిటీ, గురుకుల పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాల తరుపున 20 టీములు 250మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంతు, హై స్కూల్ హెచ్ఎం సురేష్ కుమార్,వివిధ మండలాలఉపాధ్యాయులు పీడీలు,పీఈటిలు పాల్గొన్నారు.

# పెన్షనర్లకు సమాచారం

జగిత్యాల: పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లకు ఆగస్టు 2024 మాసపు ప్రభుత్వం చెల్లించే పెన్షన్ వివరాలను తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తెలిపారు. ఆగస్టు 2024 మాస పెన్షన్లు తేది 2-9-2024 నాడు జమ అవుతాయని,జమ అయిన పెన్షన్ లో దిగువ విషయాలు కలసి వుంటాయని పేర్కొన్నారు.

(1) పి ఆర్సి బకాయిల ముప్పై రెండవ కిస్తు (32/36) కలిపి వస్తుంది.

(2) ఇంటీరియం రిలీఫ్ 5 శాతం అక్టోబర్ 2023 నుండి నగదు గా జమ అవుతుంది.

(3) డి ఆర్ బకాయిల పద్నాలుగవ కిస్తు (14/17) ఈ పెన్షన్ లో కలిపి వస్తుంది.

(4) మెడికల్ అలవెన్స్ ?600/ జమ అవుతుంది.

(5) వార్షిక పెన్షన్ ?7,50,000/ ఆ పైన పొందే పెన్షనర్లకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్నును మార్చి 2024 నుండి (ప్రతి నెలా 12 నెలల వరకు (ఫిబ్రవరి 2025 వరకు) న్యూ ట్యాక్స్ రెజిమ్ (కొత్త పద్దతి) లో మినహాయిస్తున్నారని,. ఆ మేరకు పెన్షన్ తగ్గే అవకాశం ఉంటుందన్నారు. పి ఆర్ సి బకాయిలు ఇంకో నాలుగు నెలలలో,డి ఆర్ బకాయిలు ఇంకో మూడు నెలలలో పూర్తి అవుతాయని, ఆ తదుపరి ఆ మేరకు పెన్షన్ తగ్గుతుందని హరి ఆశోక్ కుమార్ పెన్షనర్ల సమాచారం కోసం తెలిపారు.

# ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలనిప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఆయన ఆయన సతీమణి కాంతకుమారి కోరారు. గురువారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ తెలంగాణ భవన మరియు కార్మిక సంక్షేమ మండలి వారి సౌజన్యంతో ధర్మపురి నియోజకవర్గం లోనివెల్గటూర్ మండలం గుల్లకోట గ్రామంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయన సతీమణి కాంత కుమారి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర భవన మరియు కార్మిక సంక్షేమ మండలి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రతి ఒక్క మహిళవినియోగించుకుని,ఆర్థికంగా ఎదగాలన్నారు.మహిళా సోదరీమణులు నన్ను కలిసికుట్టుమిషన్ శిక్షణ గదికి అద్దె చెల్లించే విషయంలో కొంత ఇబ్బంది ఉందని తెలపడం జరిగిందని, వెంటనే,గదికి సంబంధించిన అద్దె నేనే స్వయంగా చెల్లించి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు.. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్స్ తో పాటు కుట్టు మిషన్లు కూడా ఇవ్వడం జరుగుతుందని,ఇప్పుడు 28 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని,మరో విడతలో మరికొంత మందికి శిక్షణ ఇస్తామని,శిక్షణ విషయంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా తెలిపారు.. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాల ఉంటే వెనక్కి తగ్గం

హైదరాబాద్: హైదరాబాద్లో తన కుటుంబ సభ్యులవి అక్రమ కట్టడాలని నిరూపిస్తే తానే దగ్గరుండి కూల్చేయిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, చెరువుల్లో ఎవరు నిర్మాణాలు చేసినా కూల్చేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా హైదరాబాద్ వరకే పరిమితమని.. ఎక్కడ అక్రమ భవనాలు నిర్మించినా కూల్చేస్తామని చెప్పారు. సీడబ్ల్యూసీ సభ్యుడు పల్లంరాజు నిర్మాణాన్నే హైడ్రా మొదట కూల్చేసిందని.. జన్వాడ ఫాంహౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్లో కేటీఆర్ ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. 'కేటీఆర్ ఫాంహౌస్కు సర్పంచ్ అనుమతి ఇచ్చారంటున్నారు. వారికి అనుమతులు ఇచ్చే అధికారం ఉండదు. నిర్మాణాలకు అధికారులే అనుమతిస్తారు. పదేళ్లుగా మంత్రిగా పని చేసిన కేటీఆర్కు ఈ విషయం తెలియదా.?. నా కుటుంబ సభ్యులు కబ్జా చేశారని కేటీఆర్ నిరూపిస్తే నేనే దగ్గరుండి కూల్చేయిస్తా.' అని సీఎం స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటివరకూ హైదరాబాద్కు మాత్రమే పరిమితమని.. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకే తొలి ప్రాధాన్యమని సీఎం రేవంత్ అన్నారు. 'హైడ్రా తన పని తాను చేసుకుపోతుంది. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. ఓఆర్ఆర్ అవతల ఉన్న గ్రామ పంచాయతీలు హైడ్రా పరిధిలో ఉన్నాయి. ఫామ్హౌస్లు కట్టుకున్న చాలా మంది సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు డ్రైనేజ్ను ఉస్మాన్సాగర్, హిమాయత్ సాగర్లోకి వదులుతున్నారు. ఆ నీళ్లు హైదరాబాద్ ప్రజలు తాగాలా.? అందుకే కూల్చివేతలు. హైడ్రాకు పోలీస్ స్టేషన్ స్టేటస్ ఇస్తాం. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. 30 ఏళ్ల కింద కట్టిన అక్రమ నివాస కట్టడమైనా హైడ్రా చర్యలు తీసుకుంటుంది. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సిద్ధమైతే ఆయన నేతృత్వంలోనే చెరువుల ఆక్రమణలపై నిజ నిర్ధారణ కమిటీ వేస్తాం' అని సీఎం పేర్కొన్నారు. ఒవైసీ కాలేజీల విషయంలో విద్యా సంవత్సరం నష్టపోతుందనే టైం ఇచ్చినట్లు సీఎం రేవంత్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఆ బిల్డింగ్ కూల్చాలా వద్దా అనేది ఆలోచిస్తున్నట్లు చెప్పారు. 'రాయదుర్గంలో కూల్చివేత సరైనదే. 111 జీవోపై సుప్రీంకోర్టు, ఎన్జీటీ గైడ్ లైన్స్ పాటిస్తున్నాం. చెరువులు, కుంటల్లో కొన్ని భవనాలు కట్టుకోవడానికి ఎక్సంప్షన్ ఇచ్చింది. సెక్రెటేరియట్, జీహెచ్ఎంసీ వంటి భవనాలపై సుప్రీంకోర్టు అనుమతి ఉంది.' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి రైతుకు మాఫీ జరుగుతుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రుణమాఫీపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. రూ. 2 లక్షలపై రుణం తీసుకున్న వారు పై మొత్తాన్ని కడితే రుణమాఫీ అయిపోతుంది. వాటికి నిధులు కూడా విడుదల చేశాం. హరీశ్ రావు, కేటీఆర్ ప్రతి రైతు వద్దకు వెళ్లొచ్చని.. రుణమాఫీ అవ్వని వారి వివరాలను సేకరించి కలెక్టర్కు ఇవ్వొచ్చని సూచించారు.

# దేవనకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించాలి

**- ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి**

**- మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలి**

**- అధికారులు స్పందించే వరకు ఉద్యమాలు నిర్వహిస్తాం.**

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. శరత్ కుమార్**

**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో కు వినతిపత్రం అందజేత**




దేవనకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పునః ప్రారంభించాలని,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. శరత్ కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా నిత్యం కరువు,కాటకాలతో సతమతమవుతొందని అన్నారు. కరువు తో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందని అన్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని,వెళ్లే సమయంలో వారి పిల్లల చదువులకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందని,మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రయాసాలతో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని,చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా, ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా డి.ఎన్.టి వసతి గృహం ఉండేదని,పక్కా గృహం లేదని, ఇతర కారణాలు చూపి,నిర్వహణ లోపంతో మూసివేయడం ఏంటని ? ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు టీసీ లు తీసుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని, దీంతో అక్షిప్తను కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోబాలికల వసతి గృహం లేకపోవడంతో కర్నూలు,ఆదోని తదితర ప్రాంతాలకు విద్యాను అభ్యసిస్తున్నారని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించిన, వాటిని గాలికొదిలేశారని ఆరోపించారు. దశల వారీ ఉద్యమాల్లో భాగంగా రాస్తారోకో నిర్వహిస్తున్నామని, అధికారులు తక్షణమే స్పందించి,మండల కేంద్రంలో మూసివేసిన బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించి,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేయాలని,లేనిపక్షంలో ఉద్యమాలు మరిన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు మధు,భాస్కర్,నాయకులు ఉమేష్,సురేంద్ర,అభి,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్ సిల్లో ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని ఆ దిశగా వైద్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలి అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులను వైద్య సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ను పరిశీలించారు. పలు రికార్డులు పరిశీలించి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుండి గర్భిణీ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సరైన సూచనలు చేయాలని, వైద్యం అందించాలని అన్నారు. మొదటి నుండీ గర్భిణీ ఆరోగ్యం పట్ల పూర్తి అవగాహన పెంచుకుని సాధారణ ప్రసవానికి ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యురాలికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వార్డులలో ఏర్పాటు చేసిన టీవీలలో ఆరోగ్యం, అంగన్వాడీ సేవలు, సానిటేషన్, డ్రైడే వంటి అవగాహన కార్యక్రమాలు ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మల్యాపూర్ అంగన్వాడీ కేంద్రం సందర్శన
అనంతరం కొత్తపల్లి మండలంలోని మల్యాపూర్ అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్వాడీ కేంద్రానికి వేయించిన పేయింటింగ్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాలకు ఇదేవిధంగా పేయింటిగ్స్ వేయించాలని, అంగన్వాడీ 'ప్రాథమిక పాఠశాల' బోర్డులను ఏర్పాటు చేయించాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతిని ఆదేశించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు, బరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంలో భాగంగా 13 సంవత్సరాలు దాటిన మహిళలు, బాలికల వివరాల నమోదు గురించి అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎంపి డిఓ ప్రభు, ఎంపిఓ పివి. నర్సింహారెడ్డి, కొత్తపల్లి పిహెచ్సి వైద్యురాలు నాజియా పాల్గొన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**